


నిఖార్సయిన వార్తల నిజరూపం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

ఆదివారం 06-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 146 రూ॥ 6.00



MY HOME GROUP | MY HOME JEWEL | MY HOME Bhooja | MY HOME AVATAR | MY HOME VIHANGA | MY HOME Krishé






ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి exclusive

# పేదరికం కష్టాల నుంచి... బిలియనీర్ స్థాయి వరకు...

## మై హోమ్స్ రామేశ్వరరావు విజయ ప్రస్థానం







చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888








- చదువుకోసం మైళ్ల కొద్దీ నడిచిన బాల్యం
- హోమియో డాక్టరుగా చాలీచాలని జీవనం
- రిస్క్ తీసుకొని కొన్న భూమి దశనే మార్చేసింది
- రియల్ ఎస్టేట్ రంగంలో ప్రవేశం
- మైహోమ్స్ స్థాపన
- మహా సిమెంట్ పరిశ్రమ స్థాపన
- శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామితో పరిచయం
- ఆధ్యాత్మిక చింతన వైపు అడుగులు
- చిన్న జీయర్ స్వామికి అనుంగు శిష్యుడు





TV9 తెలుగు | 10tv | aha


- పేద విద్యార్థుల కోసం స్కూళ్ల ఏర్పాటు
- అంతర్జాతీయ ప్రమాణాలతో 'మెరు ఇంటర్నేషనల్ స్కూల్' స్థాపన
- జిమ్స్ మెడికల్ సైన్సెస్ సంస్థ ఏర్పాటు
- ముచ్చింతల్‌లో 216 అడుగుల శ్రీ రామానుజాచార్యుల విగ్రహం ఏర్పాటు
- సీఎస్ఆర్ కింద సామాజిక సేవ
- మీడియా రంగంలో ప్రవేశం
- మైహోమ్ రామేశ్వరరావు జీవితం స్ఫూర్తిదాయకం

**హైదరాబాద్, నేటిధాత్రి:**
మై హోమ్ గ్రూప్ అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు ఒక సాధారణ హోమియోపతి డాక్టర్ స్థాయి నుండి నేడు తెలంగాణలోనే అత్యంత ధనవంతులలో ఒకరిగా, వేల కోట్ల సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగిన ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం ఆయన నికర ఆస్తి విలువరూ. 20,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఆయన విజయ ప్రస్థానం మొదటి నుండి ఎలా సాగిందో ఇక్కడ చూద్దాం.

ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా) కల్వకుర్తి మండలానికి చెందిన కుడ్కిల్ల గ్రామంలో ఒక సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. కుడ్కిల్ల గ్రామం నల్లమల అడవుల ప్రాంతానికి సమీపంలో ఉండేది. ఆ రోజుల్లో అక్కడ కనీస వసతులు, రోడ్లు, రవాణా సౌకర్యాలు అస్సలు వుండేవి కావు. ఆయన చిన్న వయసులోనే తండ్రి మరణించారు. దాంతో కుటుంబ భారం, వ్యవసాయ పనులు తల్లిపై పడ్డా యి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కుడ్కిల్ల గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన తర్వాత, పైచదువుల కోసం ఆయన ప్రతిరోజూ కల్వకుర్తి పట్టణానికి సుమారు 7 నుండి 8 కిలోమీటర్లు నడిచి వెళ్లేవారు. సరైన రవాణా సౌకర్యాలు, చెప్పులు కూడా లేని ఆ రోజుల్లో.. తీవ్రమైన ఎండను, వానను లెక్కచేయకుండా చదువుపై ఉన్న పట్టుదలతోనే ఆయన రోజూ అంత దూరం ప్రయాణించారు. ఆ పల్లెటూరి క్రమశిక్షణే ఆయనను జీవితంలో అంతటి ఎత్తుకు ఎదిగేలా చేసింది. తండ్రి లేకపోవడంతో కుటుంబానికి స్థిరమైన ఆదాయం ఉండేది కాదు. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడటం వల్ల పుస్తకాలు, ఫీజుల కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ, చదువుపై ఉన్న విపరీతమైన ఆసక్తి వల్ల ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.


12 లో





22ND ANNIVERSARY వసంతాల అక్షరోద్యమం 2004-2026

# "నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999



# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక
22nd ANNIVERSARY



ఆదివారం 06-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 146 రూ॥ 6.00


# చేయూత పెన్షన్లకు కొత్త మార్గదర్శకాలు

- కొత్త పెన్షన్లకు ఫీల్డ్ వెరిఫికేషన్ తప్పనిసరి
- ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలన



హైదరాబాద్, నేటిధాత్రి:
చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. కొత్త పెన్షన్లకు క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. అర్హుల ఎంపిక కోసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రామీణ ప్రాంతాల్లో మండల స్థాయి అధికారులు, మున్సిపల్ ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సర్కిల్ స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వెరిఫికేషన్ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఇందులో దరఖాస్తుదారుల వివరాలు, వెరిఫికేషన్ నివేదికలు, అధికారుల అభిప్రాయాలను నమోదు చేయనున్నారు. దరఖాస్తులతో సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అర్హత నిర్ధారించి పెన్షన్ మంజూరుకు సిఫార్సు చేయనున్నారు. అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేసి, పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే వెరిఫికేషన్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# భూములమ్మే ప్రయత్నం

### ధరణితో బీఆర్ఎస్ మోసం.. భూభారతితో కాంగ్రెస్ అవినీతి
### 22ఏ పేరుతో పట్టా భూములను అడ్డుకుంటున్నారు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
ధరణి పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఇప్పుడు భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి తెరలేపిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో పట్టాలు, అనుమతులు ఉన్న భూములను కూడా చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.
కేసీఆర్ మాదిరిగానే సీఎం రేవంత్‌రెడ్డి కూడా భూములను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భూములు విక్రయించకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. వక్ఫ్ భూములు మినహా ఇతర భూములపై ప్రభుత్వం కన్నేసిందని విమర్శించారు.
తెలంగాణను 'ఆర్ఆర్ రియల్ ఎస్టేట్' సంస్థగా మార్చారని కిషన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల భూములకు రక్షణ కల్పించాలని, 22ఏ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# క్షీణించిన రెవెన్యూ వ్యవస్థ!

- 22ఏ భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలి
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాలో భూములను కుట్రపూరితంగా చేర్చారని ఆరోపించారు.
హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన బీజేపీ మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ 22ఏ భూముల సమస్యలతో మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూ సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన భూ భారతి విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
గతంలో 15 శాతం కమీషన్లు ఉంటే ప్రస్తుతం 30 శాతం వరకు పెరిగాయని ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని రాంచందర్ రావు విమర్శించారు.

# ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిందే

- 22ఏ జాబితాలో చేర్చడంపై సింఫనీ పార్క్ హోమ్స్ వాసుల ఆవేదన
- తప్పులకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి: ఎంపీ రఘునందన్‌రావు



పటాన్‌చెరు, నేటిధాత్రి:
ప్రజల ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో నిర్వహించిన 22ఏపై సమావేశానికి ఆయన హాజరై కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1,500

11లో

# 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం

## ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అనే మొక్కను మొలవనివ్వను



- వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగితే 117కు 117 గెలుస్తాం.. పెరగకపోతే 97 సీట్లతో కాంగ్రెస్‌దే విజయం
- ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. మూడు రంగుల జెండా ఎగురవేస్తా
- వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తా.. కాస్కోవాలని సవాల్ – సీఎం రేవంత్‌రెడ్డి

నకిరేకల్, నేటిధాత్రి:
రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సీట్లు పెరిగితే 117 స్థానాల్లోనూ గెలుస్తామని, సీట్లు పెరగకపోతే 97 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. 2024 నుంచి 2034 వరకు పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఇదే తన సవాల్ అని స్పష్టం చేశారు. ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అనే మొక్కను మొలవనివ్వనని వ్యాఖ్యానించారు.
నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. రూ.345 కోట్లతో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. నకిరేకల్‌లో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించి.. వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

### మీరిచ్చిన రుణమాఫీ మిత్తిలకే సరిపోయింది

బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం సూచించారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి కొంతమంది జీర్ణించుకోలేక ఊరూరా తిరుగుతున్నారని విమర్శించారు. "మీరిచ్చిన రైతు రుణమాఫీ మిత్తిలకే సరిపోయింది. చివరి రైతు భరోసా వేస్తానని మోసగించి కేసీఆర్ గద్దె దిగారు. మీరు ఎగ్గొట్టిన రైతు భరోసా కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లను రైతులకు మేము చెల్లించాం. ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా, రుణమాఫీని 30 నెలల్లో పూర్తి చేశాం. చేతనైతే తండ్రి, కొడుకులు అసెంబ్లీకి రావాలి. అన్ని అంశాలపై చర్చిద్దాం" అని సవాల్ చేశారు.

### ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతకాలం ఇందిరమ్మ రాజ్యంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని సీఎం తెలిపారు. ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అన్ని పథకాల్లో వారిని భాగస్వాములను చేశామని అన్నారు. "కోటి మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల చొప్పున ఖర్చులు మిగిలాయి. కేసీఆర్ ఏనాడైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? మేము ఇచ్చే పథకాల్లో ఏమైనా ఇచ్చారా?" అని ప్రశ్నించారు.

### తొలి ఏడాదిలోనే 72 వేల ఉద్యోగాలు

నియామకాల విషయంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. "మీరే నోటిఫికేషన్లు ఇస్తే.. మీ హయాంలో ఎందుకు నియామకాలు చేపట్టలేదు? దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 72 వేల ఉద్యోగాలు ఇచ్చింది" అని పేర్కొన్నారు. కాకుల్లా ఊరు మీదపడి దోచుకునేందుకు తిరుగుతున్నారు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "కేసీఆర్ సీఎం అయితే హరీశ్‌రావు, కేటీఆర్‌లను మంత్రులను చేశారు. నేను సీఎం అయితే అందరికీ మంత్రి పదవులు, ఎంపీ పదవులు, ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాను. కేసీఆర్ సీఎం అయితే ఆయన విగ్రహం కోసం ఐదెకరాలకు కాంపౌండ్ పెట్టారు. కాకుల్లా ఊరు మీదపడి దోచుకునేందుకు తిరుగుతున్నారు. మా పాలనను చూసి బావాబామ్మర్దులు గుక్కపెట్టి ఏడుస్తున్నారు" అని అన్నారు.

### సిరిసిల్లకు వస్తా.. సిద్దిపేటపై దండయాత్ర చేస్తా

"ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా.. మూడు రంగుల జెండా ఎగురవేస్తా. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తా.. కాస్కోవాలి" అంటూ బీఆర్ఎస్ నేతలకు సీఎం సవాల్ విసిరారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డ సీఎం.. "నాకు చదువు లేదని అంటున్నారు.. సంస్కారం ఉంది. కాబట్టే మీరు ఇలా ఉన్నారు" అని వ్యాఖ్యానించారు.

### అసెంబ్లీకి వచ్చి చర్చించండి

కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకపోవడంపైనా రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. "ఏ అంశంపై అయినా అసెంబ్లీలో చర్చించడానికి మేము సిద్ధం. మీరు అసెంబ్లీకి రావాలి. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌లో ఉన్నారు" అని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్!

### రెండు డీఏల విడుదలకు చంద్రబాబు ఆమోదం



- పెన్షనర్లకు అదనపు క్వాంటం పింఛన్ పునరుద్ధరణ
- 2022 సరెండర్ లీవుల బకాయిల చెల్లింపునకు నిర్ణయం
- ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు

అమరావతి, నేటిధాత్రి :
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో రెండు డీఏలను విడుదల చేయడానికి ఆమోదం తెలిపారు. 2024 జూలై 1, 2025 జనవరి 1కు సంబంధించిన డీఏలను అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అదనపు క్వాంటం పింఛన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి పునరుద్ధరించనున్నారు. 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పింఛన్ వర్తించనుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని క్రమబద్ధీకరించేందుకు కూడా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుంది. ఇప్పటివరకు ఉద్యోగులకు సంబంధించిన రూ.30,849 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగవంతమైన విచారణ



- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్సీ, ఎస్టీల ఆర్థిక సాధికారతకు సమగ్ర కార్యాచరణ
- అవకాశాలు లేక కాదు..అవగాహన లేకే వెనుకబాటుతనం: సీఎం చంద్రబాబు

అమరావతి, నేటిధాత్రి:
ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి, నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రత్యేక, సెషన్ కోర్టుల ద్వారా త్వరగా పరిష్కరించాలని సూచించారు.
ఎస్సీ, ఎస్టీల రక్షణతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతపై సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. బాధితులకు పరిహారం, గృహ వసతి తదితర ప్రయోజనాలను సత్వరమే అందించాలని ఆదేశించారు.
జిల్లా స్థాయి సమావేశాలు పెండింగ్‌లో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన చంద్రబాబు.. కలెక్టర్లు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రవేశాలు పొందే స్థాయికి తీర్చిదిద్దాలని, ఆర్థిక సంస్థల ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు.
"అవకాశాలు లేక కాదు.. అవగాహన లేకే వెనుకబాటుతనం" అని సీఎం వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ, అటవీ ఉత్పత్తుల ద్వారా ఆదాయ వనరులను పెంచి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

# వెయ్యి రోజుల మోసం...
# రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి!

- యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు.. ఒక్కటీ అమలు కాలేదు
- 100 రోజుల్లో హామీలన్నీ అన్నరు.. వెయ్యి రోజులైనా జాడే లేదు
- 2 లక్షల ఉద్యోగాలంటూ నిరుద్యోగులను నిండా ముంచారు
- కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. లూటిఫికేషన్ ప్రభుత్వం: కేటీఆర్



కరీంనగర్, నేటిధాత్రి:
తెలంగాణ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి.. ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువభేరి, నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. 365 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో కేవలం 16 వేల

11లో



- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎక్కడ? 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- జీవో 97 రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలి
- రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్‌ను ఎందుకు నిలిపివేశారు?
- కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల పరిస్థితి దయనీయం: మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట/దుబ్బాక, నేటిధాత్రి:
ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో నిరుద్యోగ యువత నిరసన, దుబ్బాకలో 'రైతు పొలికేక' కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థుల ఫీజుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని గుర్తుచేశారు.
పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకునేది లేదని, అసెంబ్లీలో గట్టిగా పోరాడతామని స్పష్టం చేశారు.
రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించిన హరీశ్‌రావు.. జాబ్ క్యాలెండర్ కాస్తా 'జాబ్‌లెస్ క్యాలెండర్'గా మారిందని ఎద్దేవా చేశారు. ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు.
రైతుల సమస్యలపై మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ వంటి పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వడ్ల కొనుగోళ్లలో తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం కొనకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రిగా రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డిదేనని అన్నారు.
సిద్దిపేటకు తాను తీసుకొచ్చిన విద్యాసంస్థలు, వెటర్నరీ కళాశాల, శిల్పారామం, రంగనాయకసాగర్ అభివృద్ధి పనులను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడాన్ని తప్పుబట్టారు.
"మీ కోసం గట్టిగా అడుగుతా.. గల్లా పట్టుకుని అడుగుతా.." అంటూ విద్యార్థులు, నిరుద్యోగులు, రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు ప్రకటించారు.

# సీఎం సభకు రూ.30 లక్షలు..పరకాల అభివృద్ధికి పైసా లేదు!

- అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి
- వంద పడకల ఆస్పత్రి వెంటనే ప్రారంభించాలి
- పరకాలకు వైద్య కళాశాల మంజూరు చేయాలి: పోచంపల్లి



పరకాల, నేటిధాత్రి:
పరకాల పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం పర్యటనకు మున్సిపాలిటీ నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేసినా.. పట్టణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. 22 మంది కౌన్సిలర్లకు అభివృద్ధి నిధులు ఇవ్వాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు అనుసంధానం చేసి పరకాలను ప్రధాన కూడలిగా అభివృద్ధి చేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ, శీతల గిడ్డంగి ఏర్పాటు, వంద పడకల ఆస్పత్రి ప్రారంభం, వైద్య కళాశాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిష్పక్షపాత వార్తల నిలయం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

ఆదివారం 06-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 146 రూ॥ 6.00



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888





# వీర నారి.. ఉద్యమ భేరి!





## రాములమ్మ కు మంత్రి యోగం.. తెలంగాణ ఉద్యమ సలాం!

- మలి తరం ఉద్యమ కెరటం.. •తెలంగాణ ఝాన్సీ రాములమ్మ
- ఉద్యమ రూపం.. తెలంగాణ ఝాన్సీ అవతారం.
- తెలంగాణ కోసం పోరాడిన మలితరం ఝాన్సీ రాణి.
- తల్లి తెలంగాణ తో ఉద్యమానికి ఊపిరి.
- జై తెలంగాణ అనేందుకు జంకు తున్న రోజుల్లోనే గర్జించిన శివంగి.
- ఉజ్వలమైన సినీ భవిష్యత్తు ను కాదనుకొని తెలంగాణా జెండా ఎత్తిన వీర నారి.
- సినిమాలు తీసేందుకు నిర్మాతలు క్యూలో నిలుచున్నా సినిమా వదిలేసుకున్నారు.
- కోట్ల రూపాయల ఆదాయం తెలంగాణ కన్నా ఎక్కువ కాదనుకున్నారు.
- పేరు, ప్రఖ్యాతులు వదులు కొని సామాన్య ఉద్యమ కారిణి గా మారారు.



- సంపాదించినదంతా ఉద్యమానికి ఖర్చు చేశారు.
- ఏనాడు మాట తప్పలేదు. మడమ తిప్పలేదు.
- జై తెలంగాణ నినాదం వదులుకోలేదు.
- బీజేపీ లో వుంటే ఇప్పటికే అనేక పదవులు అవిష్కరించే వాళ్ళు.
- కేంద్ర మంత్రి స్థాయిలో వెలుగొందే వారు.
- తెలంగాణ కోసం బీజేపీ ని కూడా కాదనుకున్నారు.
- రాజకీయ పదవుల కోసం ఆరాట పడలేదు.
- తెలంగాణ వస్తే చాలనుకున్నారు.

## తెలంగాణ సాధనే జీవిత లక్ష్యం చేసుకున్నారు.



హైదరాబాద్, నేటిధాత్రి:

త్యాగమనే పరంపరకు నిదర్శనం, నిర్వచనం రాములమ్మ. తెలంగాణ ఉద్యమ నారీ,బేరీ రాములమ్మ. ఉచ్చ స్థితిలో వున్న సనీ భవిష్యత్తును కాదనుకొని తెలంగాణ సాధన కోసం జీవితం త్యాగంచేసిన త్యాగమయి రాములమ్మ. దేశానికి ఆమె సినీ రాణీ కావొచ్చు కాని తెలంగాణకు మాత్రం ఆమె ఝాన్సీ రాణి. మలి దశ తెలంగాణ ఉద్యమ భోణి. మలి దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి. చైతన్య వేణి. పోరాట వాణి. సినీ జగత్తును ఏలాలనుకుంటే ఆమె భవిష్యత్తు ఒక రకంగా వుండేది. రాజకీయాలను ఏలాలనుకుంటే మరో ఎత్తులో వుండేది. కాని అవేవీ ఆమె వద్దనుకున్నారు. తెలంగాణ ఉద్యమమే లక్ష్యమనుకున్నారు. ఉద్యమంలోకి దూకారు. పుట్టిన గడ్డ మీద పెంచుకున్న మమకారాన్ని ఉద్యమంగా మార్చుకున్నారు.కష్టపడి సంపాదించుకున్న కోట్ల రూపాయలను ఉద్యమానికి ఖర్చు చేశారు. ఒక్కరై తెలంగాణ సాదన అడుగులు మొదలు పెట్టి, లక్షలాది మంది ఉద్యమ కారులను తయారుచేశారు. తల్లి తెలంగాణ పార్టీ ఏర్పాటు చేసి తెలంగాణ జెండా ఎగుర వేశారు. ఉద్యమ పోరులోకి దూకారు.తెలంగాణ వాదవే నినాదమైన కొట్లాడారు. తెలంగాణ సాధన కోసం పోరుబాట పట్టారు. కాని విడివిడిగాపోరాటం కన్నా కలసి సాగితే మరింత బలమౌతుందన్న వారి మాటలు నమ్మారు. తనకు పేరు కన్నా,తెలంగాణ సాదనే ముఖ్యమనుకున్నారు. నమ్మించిన వారి మాటలు నమ్మారు. కలిసి సాగేందుకు ఉద్యమకార్యకర్తగా మారారు. ఒక పార్టీ ఏర్పాటు చేసి, మరో పార్టీకి బలమయ్యారు. కాని ఆఖరుకు రాములమ్మే బలయ్యారు. కాని ఎక్కడా చింతించలేదు. చింతకు గురి కాలేదు. ఊపిరి కూడ దీసుకున్నారు. చరిత్రలో తన అద్యాయాన్ని ఎవరూ చెరపలేరని ధైర్యం కూడ దీసుకున్నారు. తెలంగాణ సాదించాన్న సంతృప్తితో జీవితం గడుపుతున్నారు. కాని సామాన్య ఉద్యమ కారులుగా కనిపించిన వారు, ఇప్పుడు ఉద్యమ ఫలాల పేరుతో పదవులు పొందిన వారున్నారు. రాజకీయాలను ఏలుతున్న వారున్నారు. కాని నిండు కుండ తొనకదు అనే నిజాన్ని ఆమె ఇప్పటికీ సార్ధకం చేసుకుంటున్నారు. కలలు గన్న తెలంగాణ తెలంగాణ వచ్చినా, బౌతిక తెలంగాణ ఏర్పాటైనా, సామాజిక తెలంగాణ సాధన కాలేదు? అనే వేధన ఆమెను ఇంకా తొలుస్తూనే వుంది. సామాజిక తెలంగాణ ఏర్పాటుతోనే నిజమైన తెలంగాణ అని ఆమె మధనపడుతూనే వుంటారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సబ్బండ వర్గాలకు ఇంకా వరం కాలేదన్న బాధను ఇప్పటికీ వ్యక్తంచేస్తుంటారు. పేదల జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదని ఆందోళన చెందుతూనే వుంటారు. ఏ తెలంగాణకోసం కొట్లాడామో ఆ తెలంగాణ ఇంకా ఆవిష్కారం కానందుకు చింతిస్తూనే వున్నారు. బహుజన తెలంగాణ కావాలి. సామజిక తెలంగాన సాధన జరగాలన్న ఆలోచనతోనే ఆమె వున్నారు. ఏనాడు రాజకీయం కోసం ఆమె పాకులాడలేదు. రాజకీయల్లో పదవులు ఆశించలేదు. కాని రాములమ్మ త్యాగాన్ని గుర్తించాల్సిన అవసరం వుంద. వచ్చిన తెలంగాణ, కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో మరింత ప్రగతి కోసం రాములమ్మ సూచనలు కావాలి. రాములమ్మ ఆలోచనలు అమలు కావాలి. రాములమ్మకోరుకున్న తెలంగాణ నిర్మాణం జరగాలి. తెలంగాణ కోసం ముందుండి కొట్లాడిన రాములమ్మ త్యాగాన్ని కాంగ్రెస్ గుర్తించి ఎమ్మెల్సీ ఇచ్చారు. కాని ఆమె సేవలు వినియోగించుకోవాలని ఉద్యమ కారులు కోరుకుంటున్నారు. కీర్తి ప్రతిష్టలు ఆమె చూడనివి కాదు. ఉన్నతమైన జీవితం ఆమెకు తెలియంది కాదు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ అనే పదాన్ని ఉచ్చరించడానికి కూడా నాయకులే భయపడుతు న్నరోజుల్లో జై తెలంగాణ అని రాములమ్మ నినదించారు. తెలంగాణ జెండా ఎత్తుకున్నారు. పెద్ద పెద్ద నాయకులుగా చెలామణి అయిన వారికే సాద్యం కాని రాజకీయ పార్టీని నిర్మాణం చేశారు. ఉద్యమాన్ని ఉధ్రూతలూగించేందుకు మొదటి పార్టీని త్యాగం చేశారు. అప్పటికే బిజేపిలో కీలకమైన నేతగా వున్నారు. తెలంగాణ కోసం బిజేపిని వదులుకున్నారు. సినీ స్టార్‌డమ్‌ను వదిలేసుకున్నారు. సినిమాలకు దూరమయ్యారు. కోట్ల రూపాయలు పట్టుకొని రాములమ్మ కాల్ షీట్ల కోసం ఎదురు చూస్తున్న వారిని కాదన్నారు. కోట్ల రూపాయల ఆదాయం కన్నా, తెలంగాణ రాష్ట్ర సాధన ఎక్కువనుకున్నారు. ఆడంబరాలకన్నా తెలంగాణ ఉద్యమమే మేలనుకున్నారు. తెలంగాణప్రజలు కష్టపడుతుంటే, కన్నీళ్లు పెట్టుకుంటుంటే, కరువు కోరల్లో బతుకుతుంటే తాను సంతోషం ఎలా వుండగలగని సినిమా జీవితం వదిలేసుకున్నారు.ఇక సినీ ప్రస్థానం చాలనుకున్నారు. తెలంగాణ సాధనే జీవిత లక్ష్యం చేసుకున్నారు. నిజంగా రాజకీయాలే కావాలనుకుంటే అంతకు ముందు బిజేపిలోనే పదవులు అందుకునే వారు. ఇప్పటిదాకా బిజేపిలోనే వుంటే కేంద్రంలో పెద్ద పదవులు అలంకరించేవారు. సుష్మా స్వరాజ్ తర్వాత అంత పెద్ద స్థాయిలో వుండేవారు. మూడు సార్లు వరస విజయాలు చవి చూసిన బిజేపిలో కీలకపాత్ర పోషించేవా రు. ఒక వేళ ఉద్యమ సమయంలోనే కాంగ్రెస్‌లో చేరినా ఆమె గొప్ప గొప్ప పదవులే పొందేవారు. కాని రాములమ్మ ఏనాడు పదవలు కోసం ఆశపడలేదు. పదువులను కోరుకోలేదు. తెలంగాణ సాధనే తన జీవిత పరమార్ధమనుకున్నారు. మంచి కోసం వెళ్తే వంచనకు గురౌతామన్నట్లు ఏ పార్టీకోసమైతే రాములమ్మ పనిచేశారో ఆ పార్టీయే రాజకీయంగా సమాధి చేయాలని చూశారు. అయినా వెరలేదు. వెనుకడుగు వేయలేదు. కొట్లాడిన తెలంగాణ సాదనతో ఆమె సంతృప్తితో జీవితం గడుపుతున్నారు. ఆమె త్యాగం కాంగ్రెస్‌పార్టీ గుర్తించింది. ఎమ్మెల్సీ ఇచ్చింది. ఇప్పుడు మంత్రిగా రాములమ్మకు అవకాశమిస్తే బాగుంటుందని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమ కారులంతా ముక్త కంఠంతో విన్నవించుకుంటున్నారు. రాములమ్మను మంత్రిని చేయాలని కోరుతున్నారు. ఉద్యమకారులు కాని వాళ్లెందరో తెలంగాణలో మంత్రులయ్యారు. తెలంగాణ కోసం కోసం ధీశాలిగా అభినవ ఝాన్నీ రాణిగా పోరాటం చేసిన రామలమ్మకు మంత్రి పదవి ఇస్తేనే ఆమె త్యాగానికి నిజమైన గుర్తింపు దక్కినట్లు రాములమ్మ తెలంగాణ వాదులు కాంగ్రెస్‌పార్టీని అభ్యర్ధిస్తున్నారు.




నిష్పక్షపాత వార్తల నిలయం

22ND ANNIVERSARY

వసంతాల అక్షరోద్యమం 2004-2026

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

ఆదివారం 06-09-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 146 రూ|| 6.00




# చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ అలుపెరుగని పోరాటం




- టీడీపీని కాపాడుతున్న జనసేన
- పవన్ కళ్యాణ్ కింగ్‌మేకర్ కాకపోతే టీడీపీ అధికారంలోకి రావడం కష్టం
- అమరావతికి ప్రతిగా 'మవిగున్' కారిడార్ ను ప్రతిపాదిస్తున్న జగన్
- అభివృద్ధి పనుల్లో క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నదంటూ ప్రభుత్వంపై దాడి
- మెగా డీఎస్సీపై కూటమి ప్రభుత్వంపై విమర్శలు
- రైతు సమస్యలపై రాజకీయ పోరాటం
- రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- మడమ తిప్పని జనగ్, అలుపెరుగని చంద్రబాబు మధ్య రాజకీయ సమరం







**హైదరాబాద్, నేటిధాత్రి:**

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతఅత్వంలోని కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్సీపీ) అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూకుడుగా పోరాడుతున్నారు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత ప్రతిపక్షంలోకి వచ్చిన జగన్, ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగడుతూ జాతీయ మరియు స్థానిక స్థాయిల్లో నిరంతర ఒత్తిడి తెస్తున్నారు. ప్రధా నంగా ఆయన ఐదు వ్యూహాలతో ముందు కెళుతున్నారు. అవి వరుసగా అమరావతి వర్సెస్ 'మవిగున్' కారిడార్ (రాజధాని క్రెడిట్ వార్), నిరుద్యోగం-ఉద్యోగాల భర్తీపై పోరాటం, శాంతి భద్రతలపై ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు, రైతు సమస్యలు-ప్రకఅతి వైపరీత్యాలు, రాబోయే స్థానిక ఎ న్నికలకు వ్యూహం. జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా సోషల్ మీడియా, ప్రెస్ మీట్లు మరియు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు, సూపర్ సిక్స్‌హామీల అమలులో ఆలస్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నారు. నిజం చె ప్పాలంటే పవన్ కళ్యాణ్ "కింగ్ మేకర్" పాత్ర పోషించకుండా ఉండి ఉంటే, 2024లో వైఎస్ జగన్‌ను ఢీకొట్టడం టీడీపీకి అత్యంత కష్టతరమయ్యేది. అందువల్ల, టీడీపీ ఘన విజయానికి, మ నుగడకు పవన్ కళ్యాణ్ నాయకత్వమే ప్రధానమైన మరియు అత్యంత కీలకమైన ఉత్ప్రేరకం అనిచెప్పవచ్చు. జనసేన లేకపోయినా టీడీపీ ఒక ప్రతిపక్ష పార్టీగా మనుగడ సాగించగలదు కానీ, ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరిగా అధికారంలోకి రావడం లేదా వైఎస్ జగన్‌ను ఓడించడం మాత్రం అసాధ్యం. ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు-పవన్ కళ్యాణ్ ద్వయం ఒకరికొకరు పరస్పర పూరకాలు.

## రాజధాని, క్రెడిట్ వార్ (అమరావతి వర్సెస్ మవిగున్ కారిడార్)

అమరావతిని ఏకైక రాజధానిగా అభివృద్ధి చేస్తామన్న చంద్రబాబు నిర్ణయాన్ని జగన్ తీవ్రంగా తప్పుబడుతున్నారు. దీనికి బదులుగా 'మవిగున్' కారిడార్ వంటి ప్రత్యామ్నాయాల అంశాన్ని లేవనెత్తుతున్నారు. కడప జేఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టులకు తమ హయాంలోనే పర్యావరణ అనుమతులు, భూమి, నీటి కేటాయింపులు జరిగాయని, కూటమి ప్రభుత్వం కేవలం పాతపనులకే కొత్తగా క్రెడిట్ తీసుకుంటోందని జగన్ కౌంటర్ ఇస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన ఒక సరికొత్త వ్యూహాత్మక అభివఅద్ధి నమూనా లేదా రాజధాని ప్రత్యామ్నాయ ప్లానే "మవిగన్" కారిడార్. చంద్రబాబు నాయుడు నేతఅత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్మిస్తున్న అమరావతిరాజధానికి ప్రత్యామ్నాయంగా జగన్ ఈ సరికొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారు. వీటిల్లో "మ" అంటే మచిలీపట్నం, "వి" అంటే విజయవాడ, "గున్" అంటే గుంటూరు. ఈ మూడు నగరాల మొదటిపేర్లను కలిపే సంక్షిప్త నామమే "మవిగున్". ఈ మూడు నగరాలను కలుపుతూ సుమారు 110 కిలోమీటర్ల పొడవునా అభివఅద్ధి చేసే ఒక కోస్టల్ అర్బన్ డెవలప్‌మెంట్ కారిడార్‌ను జగన్ ప్రతిపాదించారు. అమరావతి లాంటి గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నిర్మాణానికి లక్షల కోట్లు ఖర్చు పెట్టడం కంటే, ఇప్పటికే మౌలిక వసతులు, జాతీయ రహదారులు ఉన్న మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించడం ఆర్థికంగా చాలా లాభదాయకమని జగన్ వాదిస్తున్నారు. అమరావతికి పెట్టే ఖర్చులో కేవలం 10 శాతం ఖర్చుతోనే దీన్ని అ ద్భుతంగా నిర్మించవచ్చని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. అమరావతి ప్రాజెక్ట్ చంద్రబాబు నాయుడు మరియు కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం చేస్తున్న ఒక పెద్ద "రియల్ ఎస్టేట్ స్కామ్" అని, అక్కడ ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని జగన్ ఆరోపించారు. గతంలో జగన్ తెచ్చిన 'మూడు రాజధానుల' ప్రతిపాదనకు ఇది కాస్త భిన్నమైనది. ఇది ప్రాంతాల మధ్య విభేదాలు సఅష్టించకుండా, కేవలం కోస్తాంధ్రా పరిధిలోనే బలమైన ఆర్థిక హబ్‌ను సఅష్టించే ప్రాక్టికల్ ప్లాన్ అని జగన్ చెప్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఈ ప్రతిపాదనను కేవలం ఒక విమర్శగానే కాకుండా,తమ పార్టీ భవిష్యత్తు ఎన్నికల ప్రధాన అజెండాగా ప్రకటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు "అమరావతి వర్సెస్ మావిగున్న (అమరావతి వర్సెస్ మవిగున్) మధ్య జరిగే ఒక రెఫరెండం అని,తాము అధికారంలోకి వస్తే 'మావిగున్' నమూనానే అమలు చేస్తామని జగన్ స్పష్టం చేశారు. సహజంగానే కూటమి ప్రభుత్వం (టీడీపీ-జనసేన-బీజేపీ) మాత్రం ఈ ప్రతిపాదనను తీవ్రంగా ఖండిస్తోంది. గత ఐదేళ్ల కాలంలో రాజధానిని నిర్మించకుండా కాలయాపన చేసిన జగన్, ఇప్పు డు ప్రజలను పక్కదారి పట్టించడానికి, ప్రాంతీయ విభేదాలు రేపడానికి 'మావిగన్' అనే కొత్త డ్రామాను తెరపైకి తెచ్చారని కూటమి నేతలు విమర్శిస్తున్నారు.

## అభివృద్ధి పనులపై క్రెడిట్ వార్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతఅత్వంలోని కూటమి ప్రభుత్వానికి, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మధ్య అభివఅద్ధి పనులపై తీవ్రమైన క్రెడిట్ వార్ (రాజకీయ ఘర్షణ) నడుస్తోంది. వైఎస్సార్సీపీ హయాంలో ప్రారంభించిన లేదా పూర్తి చేసినప్రాజెక్టులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుని "క్రెడిట్ చోరీ" చేస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు విజన్ ఇచ్చింది తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అని, అత్యంత సంక్లిష్టమైన ట్విన్ టన్నెల్స్ (జంట సొరంగాలు) పనులను తమ వైఎస్సార్సీపీ ప్రభుత్వమే పూర్తి చేసిందని జగన్ పేర్కొన్నారు. కేవలం 1996లో శంకుస్థాపన చేసిన చంద్రబాబు, ఇప్పుడు ప్రచార ఆ ర్భాటాలతో చరిత్రను మార్చాలని చూస్తూ క్రెడిట్ కొట్టేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్సీపీ హయాంలో 2024 మార్చిలో నీళ్లు లేకుండానే ఫేక్ ప్రారంభోత్సవం చేశారని ఐటీ మంత్రి నారాలోకేష్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వమే నిధులు విడుదల చేసి, పునరావాస పనులను వేగవంతం చేసి నిజంగా కఅష్ణా జలాలను పారించిందని టీడీపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువను తెరిచి ఉత్తరాంధ్ర జిల్లాలకు గోదావరి జలాలను విజయవంతంగా తరలించిన ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ ప్రకటించింది. గత ఐదేళ్ల జగన్ పాలనలో డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడంతో పాటు కేంద్ర నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.పోలవరం ప్రాజెక్టు కాలువలు, హెడ్ రెగ్యులేటర్ల వంటి కీలక పనులు గ తంలో వైఎస్సార్, వైఎస్సార్సీపీ హయాంలోనే మెజారిటీ భాగం పూర్తయ్యాయని వైఎస్సార్సీపీ వాదిస్తోంది. డ్యామ్ పనులు, నిర్వాసితుల పునరావాసాన్ని పక్కనబెట్టి, కేవలం పాత పనులతో పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని జగన్ మండిపడ్డారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, వైఎస్సార్సీపీ హయాంలోనే జీ ఎంఆర్ సంస్థతో ఒప్పందాలు, పర్యావరణ-రక్షణ అనుమతులు, మౌలిక వసతుల కల్పన వంటికీలక మైలురాళ్లన్నీ తామే పూర్తి చేశామని జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు ఏమాత్రం శ్రమ లేకుండా క్రెడిట్ తీసుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ఈ ఆరోపణలను తిప్పికొడుతూ, వైఎస్సార్సీపీనే ప్రతి ప్రాజెక్టులోనూ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని, వాస్తవ అభివృద్ధి కూటమితోనే సాధ్యమని పేర్కొన్నారు.

కడపలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి తమ హయాంలోనే పర్యావరణ అనుమతులు, భూమి, రోడ్డు కనెక్టివిటీ, నీటి కేటాయింపులు జరిగాయని జగన్ చెప్తుండగా, పనులను వేగవం తం చేసి ఉపాధి కల్పిస్తోంది తామేనని చంద్రబాబు చెబుతున్నారు. అలాగే రామాయపట్నం, మచిలీపట్నం రేవుల అభివృద్ధి పనుల క్రెడిట్ కూడా తమదేనని, కూటమి ప్రభుత్వం రామాయప ట్నం పోర్టును ప్రైవేటీకరిస్తూ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతోందని జగన్ ఆరోపిస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు కూటమి ప్రభుత్వం కేవలం రంగులు మార్చి, తమసొంత ఇళ్లుగా ప్రచారం చేసుకుంటోందని వైఎస్సార్సీపీ మాజీ మంత్రులు విమర్శించారు. అలాగేగత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల రీ-సర్వే కార్యక్రమానికి కూడా చంద్రబాబు ప్రభుత్వం తప్పుడు క్రెడిట్ తీసుకుంటోందని జగన్ ధ్వజమెత్తారు.

## నిరుద్యోగం - ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై పోరు

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై చంద్రబాబు నాయుడునేతఅత్వంలోని కూటమి ప్రభుత్వానికి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మధ్య రాజకీయం వేడెక్కిం ది. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'మెగా డీఎస్సీ' మరియు ఉద్యోగాల భర్తీ హామీలను కూటమి ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ జగన్ నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామనిహామీ ఇచ్చిందని, అయితే ఆ తర్వాత పోస్టుల సంఖ్యను తగ్గించి నిరుద్యోగులను మోసం చేశారని జగన్ విమర్శిస్తున్నారు. డీఎస్సీ సిలబస్ ప్రిపరేషన్‌కు తగిన సమయం ఇవ్వకుండా, పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అభ్యర్థులను అయోమయంలోకి నెట్టారని వైఎస్సార్సీపీ ఆరోపిస్తోంది. గతంలో జరిగిన గ్రూప్-1 (ముఖ్యంగా 2018 నాటి పరీక్షల పున్నమూల్యాంకనం) మరియు ఇతర పోటీ పరీక్షల నిర్వహణలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దల జోక్యం ఉందంటూ జగన్ సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా జగన్ విమర్శలు గుప్పిస్తున్నారు. నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని నిరూపించుకోవడానికి సీబీఐ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ప్రతి ఏటా క్రమబద్ధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదని జగన్ మండిపడుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేయకుండా కేవలం కాలయాపన చేస్తున్నారని, యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భఅతి (యువగళం నిధి) ఊసే లేదని క్షేత్రస్థాయిలో నిరుద్యోగులను సమీకరిస్తున్నారు. జగన్ హయాంలో తీసుకొచ్చిన గ్రామ/వార్డు వాలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పక్కనబెట్టడాన్ని జగన్ తీవ్రంగా తప్పుబడుతున్నారు. వాలంటీర్లకు నెలకు రూ. 10,000 గౌరవ వేతనం ఇస్తామని నమ్మించి, అధికారంలోకి వచ్చాక వారిని రోడ్డున పడే శారని, దీనివల్ల 2.6 లక్షల మంది యువత ఉపాధి కోల్పోయి మళ్లీ నిరుద్యోగులుగా మారారని జగన్ పోరాడుతున్నారు. జగన్ విమర్శలను చంద్రబాబు ప్రభుత్వం తీవ్రంగా తిప్పికొడుతోంది. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఒక్కటంటే ఒక్క క్రమబద్ధమైన డీఎస్సీ కూడా వేయకుండా, కేవలం 'జాబ్ లెస్ క్యాలెండర్లు' ఇచ్చి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని టీడీపీ కౌంటర్ ఇస్తోంది. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పైనే మొదటి సంతకం చేశామని, వ్యవస్థను ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని ప్రభుత్వం చెప్తోంది.





## శాంతి భద్రతలు-ఢిల్లీ వేదికగా ఆందోళనలు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతఅత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఅధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ వేదికగా దేశవ్యాప్త నిరసనలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రపరిధిలోని సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా కూటమి ప్రభుత్వంపై తీవ్ర రాజకీ య ఒత్తిడి పెంచడం జగన్ ప్రధాన వ్యూహం. రాష్ట్రంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపైజరుగుతున్న భౌతిక దాడులు, హత్యలను నిరసిస్తూ జగన్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్, శివసేన (యూబీటీ) నాయకులు, ఆర్జేడీ (ఆర్‌జేడీ), తఅణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మరియు లెఫ్ట్ పార్టీల ముఖ్య నేతలు హాజరై జగన్‌కు సంఘీభావం ప్రకటించారు. దీని ద్వారా ఏపీలో పరిస్థితిపై జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా చేశారు. ఢిల్లీ వేదికగా జగన్ ఒక ప్రత్యేకమైన ఫొటో మరియువీడియో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి కొన్ని నెలల్లోనే వైఎస్సార్సీపీ కార్యకర్తలపై జరిగిన దాడులు, ఆస్తుల ధ్వంసం, విగ్రహాల కూల్చివేతలకు సంబంధించిన దఅశ్యాలను జాతీయ మీడియా మరియు వివిధ పార్టీల నేతలకు ప్రదర్శించారు. ఏపీలో 'రా జ్యాంగ యంత్రాంగం' పూర్తిగా విఫలమైందని, ఆర్టికల్ 356 కింద రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని జగన్ డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న హింసపై సుదీర్ఘమైన నివేదికలను సమర్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని, బాధితులకు రక్షణ కల్పించాలని ఢిల్లీ నుంచి ఒత్తిడి తెచ్చారు. కూటమి ప్రభుత్వం తమ పార్టీని రాజకీయంగా అణచివేయడానికి పోలీసు వ్యవస్థను వాడుకుంటోందని జగన్ ధ్వజమెత్తారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తు న్నారని, చట్టబద్ధమైన పాలన స్థానంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని నారా లోకేష్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. జగన్ ఢిల్లీ పర్యటనను చంద్రబాబు ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అరాచకాలు, వివేకానంద రెడ్డి హత్య కేసు, తోట త్రిమూర్తులు ఉదంతం వంటి అంశాలను ప్రస్తావిస్తూ... జగన్ తనపై ఉన్న సీబీఐ, ఈడీ కేసుల నుండి తప్పించుకోవడానికే ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నారని కూటమి నేతలు ఎదురుదాడికి దిగారు. రాష్ట్ర ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## రైతు సమస్యలు - ప్రకఅతి వైపరీత్యాలు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతఅత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో తలెత్తిన రైతు సమస్యలు, ప్రకఅతి వైపరీత్యాల (ఖరీఫ్ వర్షాభావం/వరదలు)నిర్వహణపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రమైన రాజకీయ పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల కనీస బాధ్యత లేదని, వైపరీత్యాల సమయంలో అన్నదాతలను గాలికొదిలేశారని జగన్ ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో తలెత్తిన తీవ్ర వర్షాభావం (డ్రై స్పెల్స్) కారణంగా పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం స్పందించడం లేదని జగన్ మండిపడ్డారు. వర్షపాత లోటు ఉన్న ప్రాంతాల్లో రైతులకు ప్ర త్యామ్నాయ పంటల విత్తనాలు అందించడంలో, రబీ సీజన్ ముందస్తు ప్రణాళికలు వేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జగన్ విమర్శించారు. తుఫానులు లేదా తీవ్ర వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు సకాలంలో పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించడం లేదని జగన్ ఆరోపిస్తున్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆసీజన్ ముగిసేలోపే 'ఈ-క్రాపింగ్' ఆధారంగా నేరుగా రైతుల ఖాతాల్లోకి పరిహారం జమ చేశామని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటోందని జగన్ ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుల తరపున ప్రభుత్వమే వంద శాతం ప్రీమియం చె ల్లించి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసిందని జగన్ గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చి రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శిస్తున్నారు. జగన్ హ యాంలో ప్రతిష్టాత్మకంగా తెచ్చిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వ్యవస్థను కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. విత్తనాలు, ఎరువుల సబ్సిడీ పంపిణీలో దళారీల వ్యవస్థ మళ్లీ మొదలైందని జగన్ విమర్శిస్తున్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు అందించాల్సిన పెట్టుబడి సాయం నిధులను సకాలంలో విడుదల చేయడం లేదని నిలదీస్తున్నారు.

జగన్ ఆరోపణలపై కూటమి ప్రభుత్వం ఘాటుగా స్పందిస్తోంది. గత ఐదేళ్ల జగన్ పాలనలో నాణ్యత లేని విత్తనాలు, నకిలీ పురుగుల మందుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆత్మ హత్యల్లో ఏపీని అగ్రస్థానంలో నిలిపిన ఘనత జగన్‌దేనని టీడీపీ కౌంటర్ ఇస్తోంది. తాము అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులను అనుసంధానిస్తూ, జలాశయాల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తూ కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం పేర్కొంటోంది.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలు) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక కీలక టర్నింగ్ పాయింట్‌గా భావిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టి, మళ్లీ పుంజుకోవడానికి ఈ ఎన్నికలను ఒక పెద్ద అవకాశంగా మార్చుకోవాలని జగన్ వ్యూహాలు రచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పార్టీ శ్రేణులపై దాడులు జరిగాయని ఆరోపిస్తున్న జగన్, ముందుగా క్షేత్రస్థాయి క్యాడర్‌లో ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. బాధితులకు పార్టీఅండగా ఉంటుందని భరోసా ఇస్తూ, వారిని ఎన్నికల బరిలో నిలబెట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. గ్రామ, వార్డు స్థాయిల్లో పటిష్టమైన నెట్‌వర్క్‌ను మళ్లీ యాక్టివేట్ చేస్తున్నారు.టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య స్థానిక సంస్థల టిక్కెట్ల కేటాయింపులో కచ్చితంగా అసంతఅప్తి తలెత్తుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. కూటమిలో టికెట్లు దక్కని బలమైన స్థానిక నాయకులను ఆకర్షించ డం లేదా వారికి స్వతంత్రులుగా మద్దతు ఇవ్వడం ద్వారా కూటమి ఓట్లను చీల్చాలనేది వైఎస్సార్‌సీపీ వ్యూహం. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు (ఉచిత బస్సు ప్రయాణం,నిరుద్యోగ భఅతి, తల్లికి వందనం, రైతు భరోసా మొదలైనవి) పూర్తిస్థాయిలో అమలు కాకపోవ డం, ఆలస్యం కావడంపై జగన్ విస్తఅతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ స్థానిక ఎన్నికలను కూట మి 6 నెలల/ఏడాది పాలనపై ప్రజలు ఇచ్చే తీర్పుగా (రెఫరెండం) అభివర్ణిస్తూ, ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. సాంప్రదాయ ప్రచారంతో పాటు సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీల బాదుడుపై డిజిటల్ వార్ నిర్వహిస్తున్నారు. దీని ద్వారా పట్టణ ప్రాంత ఓటర్లను, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలను ప్రభావితం చేయాలని చూస్తున్నారు. గతంలో తమ హయాంలో జరిగినట్లుగానే, ఈసారి కూటమి ప్రభుత్వం అధికార బలంతో నామినేషన్లను అడ్డుకోవడం లేదా బలవంతపు ఏకగ్రీవాలు చేయకుండా ఉండేందుకు ముందస్తుగా లీగల్ టీమ్స్‌ను సిద్ధం చేశారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే కోర్టులను ఆశ్రయించేలా ప్లాన్ చేశారు.

## ప్రభుత్వాన్ని మార్చేంత వ్యతిరేకత లేదు

ఆంధ్రప్రదేశ్‌లో 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన త ర్వాత, ప్రస్తుత ప్రజల మూడ్ (రాజకీయ నాడి) తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల (ఆగస్టు2026) వచ్చిన వివిధ జాతీయ, స్థానిక సర్వేల ప్రకారం...రాష్ట్రంలో ప్రజల అభిప్రాయాలు మిశ్రమంగా, స్పష్టమైన భిన్న ధోరణులతో ఉన్నాయి. ఆగస్టు 2026 నాటి ఇండియా టుడే - సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ప్రకారం, ఏపీలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే ప్రజా మద్దతు లభిస్తుందని తేలింది. కేంద్రంలో మోదీ నాయకత్వంతో పాటు రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ద్వయం అందిస్తున్న పాలన పట్ల మెజారిటీ ఓటర్లు ఇంకా సానుకూల ధోరణిలోనే ఉన్నట్లు ఈ సర్వేలు సూచిస్తున్నాయి. అమరావతిని ఏకైక రాజధానిగా స్థిరీకరిస్తూ కేంద్రం చట్టసవరణ చేయడం వంటి అంశాలు కూటమికి సా నుకూలంగా మారాయి. ఇదిలావుండగా హైదరాబాద్‌కు చెందిన కొందరు ఐఐటీ పూర్వ విద్యా ర్థుల సమూహం ఏపీలోని 175 నియోజకవర్గాల్లో నిర్వహించినట్లు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న 'మూడ్ ఆఫ్ ఆంధ్ర' సర్వే మాత్రం భిన్నమైన ఫలితాలను చూపించింది. ఈ సర్వే ప్ర కారం నిరుద్యోగం, రైతు సమస్యలు, మరియు క్షేత్రస్థాయిలో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత కారణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు ఓటర్ల మొగ్గు పె రుగుతోందని, జగన్ సీఎం అభ్యర్థిగా రేసులో ముందంజలో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. అయితే, దీనిని కేవలం వాట్సాప్/సోషల్ మీడియా ప్రచారంగా కూటమి శ్రేణులు కొట్టిపారేస్తున్నా యి. రాష్ట్రంలో పంచాయతీలు, మున్సిపాలిటీలకు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజల అసలైన నాడిని బయటపెట్టనున్నాయి.ఈ ఎన్నికల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడే రాజకీయవేడి మొదలైంది. కూటమిలోని పార్టీల మధ్య స్థానిక సీట్ల సర్దుబాటు మరియు వైసీపీ క్షేత్రస్థాయిపోరాటం ప్రజలను ఏ వైపు తిప్పుతుందనేది ఈ ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి




# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY

ఆదివారం 06-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 146 రూ॥ 6.00







- Jana Sena propping up the TDP
- TDP unlikely to return to power without Pawan Kalyan acting as kingmaker
- Jagan proposing the 'Mavigun' corridor as an alternative to Amaravati
- Attacking the government over the alleged misappropriation of credit for development works
- Criticizing the alliance government regarding the 'Mega DSC' recruitment drive
- Political agitation over farmers' issues




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# Jagan's relentless battle against the Chandrababu government

- **Strategizing with a focus on victory in the upcoming local body elections**
- **A political clash between the unyielding Jagan and the tireless Chandrababu**

**Hyderabad, Neti Dhathri :**
విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. తాను నేడు జిల్లా ఎస్పీగా ఈ స్థాయిలో ఉండటానికి తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పాత్ర ఎంతో ఉందని ఆయన గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట దేవస్థానానికి 18 మంది సభ్యులతో నూతన పాలకమండలి

యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి తెలంగాణ ప్రభుత్వం నూతన పాలకమండలిని ఏర్పాటు చేసింది. మొత్తం 18 మంది సభ్యులతో పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



పాలకమండలి చైర్మన్‌గా ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్ ఎం. సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వం నియమించింది. నూతన పాలకమండలి పదవీకాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించింది.
యాదాద్రి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ నిర్వహణను మరింత పటిష్ఠం చేయడం వంటి అంశాల్లో నూతన పాలకమండలి కీలకంగా వ్యవహరించనుంది. భక్తుల ఆధ్యాత్మిక అనుభవాన్ని మరింత మెరుగుపరిచేలా అవసరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉంది.
నూతన పాలకమండలి ఏర్పాటు కావడంతో యాదాద్రి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని భక్తులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి సేవలు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పాలకమండలి కృషి చేయనుంది.

# అంగన్వాడీ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా వైద్యాధికారి మధుసూదన్‌రావు సూచన






గణపురం, నేటిధాత్రి:
గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో అవసరమని జిల్లా వైద్యాధికారి మధుసూదన్‌రావు అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
గణపురం మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లి, కర్కపల్లి గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి మధుసూదన్‌రావు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లితోపాటు గర్భంలోని శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకుంటే తల్లి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా శిశువు ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందని తెలిపారు. చిన్నారులకు వారి వయసుకు తగిన పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు టీహెచ్ఆర్ పోషకాహారాన్ని పంపిణీ చేశారు. పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు, ఇతర ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని అధికారులు వివరించారు.
కార్యక్రమంలో ఏఎన్ఎంలు నవీన, పార్వతి, అంగన్వాడీ టీచర్లు రామిడి కోమలదేవి, జన్ను సుసాన్, ఆశా వర్కర్లు జమున, వసంతతోపాటు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.
పోషకాహార వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలపై గ్రామీణ ప్రజలు, తల్లులు హర్షం వ్యక్తం చేశారు.

# సింగరేణి కార్మికుల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- 1000 రోజులు గడిచినా హామీలు అమలు చేయలేదు
- కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి




గణపురం, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు గడిచినా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా గణపురం మండలం బస్వరాజుపల్లి 8 ఇంక్లైన్ అండర్‌గ్రౌండ్ మెయిన్ గేట్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిందన్నారు. అయితే 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. కార్మికుల పట్ల ఇదే మొండి వైఖరిని కొనసాగిస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి కార్మికుల చేతిలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం సింగరేణి అధికారులను కలిసి కార్మికుల సమస్యలను వివరించిన గండ్ర వెంకటరమణారెడ్డి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పరిసర గ్రామాల అభివృద్ధికి సింగరేణి సంస్థ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్

## ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్



యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం మార్నింగ్ వాక్ నిర్వహించారు.
ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై ప్రజల నుంచి వివరాలు సేకరించారు.
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకునే ఉద్దేశంతో బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# మరణించిన సత్తయ్య కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
యాదగిరిగుట్ట మున్సిపాలిటీ 8వ వార్డుకు చెందిన ముక్కెర్ల సత్తయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని వార్డు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ యాదవ్ పరామర్శించారు.
ఈ సందర్భంగా సత్తయ్య కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి తనవంతు సహాయంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని కౌన్సిలర్ సత్యనారాయణ యాదవ్ తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

# పట్టణంలో నరకప్రాయంగా 16వ వార్డు కళ్ళు తెరిచి న్యాయం చేయండి

- మిషన్ భగీరథ లీకేజీలు, మురికి కాలువలు, ముళ్ళ పొదలతో ప్రజల అవస్థలు
- ఓట్లేసిన జనానికి అన్యాయం చేయొద్దు: మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ 16వ వార్డు ఇంచార్జ్ కరీముల్లా బాబా




కోదాడ, నేటిధాత్రి:
మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కనీస సౌకర్యాలు కరువై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు కళ్ళు తెరిచి వార్డు సమస్యలను పరిష్కరించాలని పట్టణ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ 16వ వార్డు ఇంచార్జ్ కరిముల్లా బాబా డిమాండ్ చేశారు. వార్డులోని పలు వీధుల్లో పర్యటించిన ఆయన స్థానిక ప్రజల ఆవేదనను వారు ఎదుర్కొంటున్న కష్టాలను మీడియాకు వివరించారు.
నాలుగు బజార్లలో నిలిచిపోయిన తాగునీరు: మిషన్ భగీరథ పైపుల లీకేజీల కారణంగా వాటిలోని నాలుగు బజార్లలో అసలు తాగునీరు రాని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైపులైన్ల మరమ్మత్తులను పట్టించుకోకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. దీనికి తోడు డ్రైనేజీ ఉరికి కాలువలను సక్రమంగా తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై వస్తుందని దోమలు దుర్వాసనతో ప్రజల రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.
ఇళ్లలో ఉండాలంటే భయం.. పాములు, తేళ్ల సంచారం:వార్డులోని పలు రోడ్ల వెంట ఇరువైపులా సర్కారు ముళ్ళకంప చెట్లు, గుంపులుగా పిచ్చి మొక్కలు, ఖాళీ ప్రదేశాల్లో, ఇళ్ల మధ్య సర్కార్ పిచ్చి ముళ్ళకంప చెట్లు దట్టంగా పెరిగిపోయాయని కరిముల్లా బాబా తెలిపారు. ఈ పొదల్లో నుంచి పాములు, తేళ్లు నివాసాల్లోకి వస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్రభ్రాంతులకు గురవుతున్నారని, పిల్లలు ఉండాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. చిన్నపిల్లలు ఆడుకునే స్థలాల పక్కన ఈ ప్రమాదకర పరిస్థితులు ఉండటం పై అధికారుల నిర్లక్ష్యాన్ని ఆయన తప్పు బట్టారు. రోడ్లన్నీ మట్టిమయం.. అస్తవ్యస్తంగా పనులు: వార్డులో ప్రణాళిక లేకుండా అనవసరపు బయట కాలువల నిర్మాణ పనులను చేపట్టి రోడ్లన్నీ మట్టిమయంగా మారి నడవడానికి వీల్లేకుండా తయారయ్యాయని విమర్శించారు. అభివృద్ధి పేరిట ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఓటు వేసిన ప్రజలకు న్యాయం చేయండి: మిమ్మల్ని నమ్మి ఓటు వేసిన ప్రజలకైన న్యాయం చేయాలని పాలక పక్షాన్ని, అధికారులను కరీముల్లా బాబా కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి లీకేజీలను అరికట్టాలని, డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, ముళ్ళ కంపలను తొలగించి వార్డు ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో భాగస్వామ్యం అవ్వాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



రామకృష్ణాపూర్, నేటిధాత్రి:
మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ మణుబోతుల కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగానివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్బర్ అలీ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు పెన్షన్‌తో పాటు అనేక హక్కులు సాధించడంలో కొమురయ్య కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఏఐటీయూసీ కార్మికుల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిరాజుద్దీన్, మండల శ్రీనివాస్, సీతారామారావు, కృష్ణస్వామి, శ్రీధర్‌రావు, డొక్కు శ్రీనివాస్, ఆవుల మల్లమ్మ, వైష్ణవి, రజిత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో 500 మంది మహిళలతో వంటా వార్పు

## మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరసన



యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది మహిళలతో 'వంటా వార్పు' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.
మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామన్న హామీని అమలు చేయకపోవడం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో జాప్యం, విద్యార్థినులకు స్కూటీల పంపిణీ చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి మహిళలతో కలిసి స్వయంగా వంట చేసి నిరసన తెలిపారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
మహిళల సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు.

# రైతుల మహాధర్నకు తరలిన నాయకులు



భూపాలపల్లి నేటిధాత్రి:
రైతుల సమస్యలను పరిష్కరించాలని, భూభారతి చట్టంలోని అవకతవకలను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్ర రావు బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నారు.
ఈ మహా ధర్నాకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.
రైతుల భూములకు రక్షణ కల్పించాలని, భూభారతి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు రైతుల పక్షాన తమ గళాన్ని వినిపిస్తున్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# చిన్నారులకు బాలామృతం చిక్కీలు పంపిణీ

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల: సూపర్‌వైజర్



మొగుళ్లపల్లి, నేటిధాత్రి:
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్దకోమటిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-2లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రామ సర్పంచ్ సప్పిడి ఇందిరా, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెరుగు సురేష్‌గౌడ్ బాలామృతం చిక్కీలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించడమే పోషణ మాసం లక్ష్యమన్నారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు బాలామృతం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. రాజకుమార్, ఉపాధ్యాయురాలు సుమలత, వార్డు సభ్యురాలు దర్శనాల కోమల, వీవోఏ అధ్యక్షురాలు మెరుగు శారద, అంగన్వాడీ టీచర్ పుష్పలత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

## అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు ...మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ హెచ్చరిక

రామకృష్ణాపూర్, నేటిధాత్రి:
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో, ముఖ్యంగా రామకృష్ణాపూర్ పట్టణంలో ఇంటి నిర్మాణాలు, వాణిజ్య భవనాల నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా బిల్డ్‌నౌ ద్వారా అనుమతులు పొందాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ సూచించారు.
భవన నిర్మాణాలకు మంజూరైన అనుమతుల్లో పేర్కొన్న సెట్‌బ్యాక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రతి నిర్మాణంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు.
ప్రధాన రహదారులపై అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లు, ఇతర అక్రమ నిర్మాణాలను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ కోరారు. అక్రమ నిర్మాణాలను



తొలగించుకోకపోతే మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ప్రజలు భవన నిర్మాణాల విషయంలో మున్సిపాలిటీ నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించాలని మురళీకృష్ణ కోరారు.

# ఘనంగా ఆచార్య కోదండరాం జన్మదిన వేడుకలు

శేరిలింగంపల్లి, నేటిధాత్రి:
తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం జన్మదిన వేడుకలను శుక్రవారం మియాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. టీజేఎస్ సిఎంసీ అవుట్‌సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు బి. అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మున్సిపల్ కార్మికులు, రవాణా విభాగం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆచార్య కోదండరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కోదండరాం పోషించిన కీలక పాత్రతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం



తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయం
కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం ప్రశంసనీయం

ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి డి. ఇమామ్ హుస్సేన్‌తో పాటు మియాపూర్ సర్కిల్ రవాణా విభాగం డ్రైవర్లు, హెల్పర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆచార్య కోదండరాంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బండ్ల ఏడుకొండలును అభినందించిన కలెక్టర్



- విద్యార్థుల అభ్యున్నతికి వినూత్న బోధనా పద్ధతులు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విశేష కృషి

నడిగూడెం, నేటిధాత్రి:
గురుపూజోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కార్యక్రమంలో రామాపురం హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బండ్ల ఏడుకొండలు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.
ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాటి నుంచి తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఏడుకొండలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడంతో పాటు దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్నారు.
ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచేలా తన కుమార్తెలను సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. తాను బోధిస్తున్న పాఠశాలలో తన చిన్న కుమార్తె రోహితిని 5వ తరగతిలో చేర్పించగా, మరో కుమార్తె బహుగంధను మునగాల మండలం బరాఖత్‌గూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని చాటుతూ పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.
పాఠశాలలో ప్రతిరోజూ సుమారు 90 శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలను చురుకుగా అమలు చేస్తూ, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి వారిని తిరిగి బడికి వచ్చేలా ప్రోత్సహిస్తున్నారు.
అలాగే కృత్రిమ మేధ ఆధారిత సాధనాలను వినియోగిస్తూ పాఠ్యాంశాలను రూపొందించడం, నూతన బోధనా పద్ధతులను అవలంబించడం, వివిధ కార్యక్రమాలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి, ప్రతిభను పెంపొందించేలా పాఠాలను బోధిస్తున్నారు.
విద్యార్థుల అభ్యున్నతికి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏడుకొండలు చేస్తున్న సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి అశోక్‌కుమార్, మండల విద్యాధికారి వనం సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపయ్య తదితరులు ఏడుకొండలును అభినందించారు.

# పరకాలలో బీఆర్ఎస్ భారీ నిరసన

- పాలిటెక్నిక్ విద్యార్థులతో అంబేద్కర్ కూడలిలో భారీ ధర్నా
- కాంగ్రెస్ యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి




పరకాల,నేటిధాత్రి
ఎన్నికల సమయంలో యువత,విద్యార్థులు,నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు.నిరుద్యోగులు ,విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా పరకాల పట్టణంలో నాలుగో రోజు భారీ ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగి తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది.బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



చేశారు.అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు.ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.పోలీసుల తీరుపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులు తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయమని ప్రశ్నించారు.ప్రశ్నించే గొంతులను అణచివేయడం చేతగాని పాలనకు నిదర్శనమని విమర్శించారు.కాంగ్రెస్ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామని,తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.జాబ్ క్యాలెండర్,యూత్ కమిషన్ ఏర్పాటు హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.విద్యార్థులకు రూ.10లక్షల వడ్డీలేని రుణాలు,విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు,రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామన్న హామీలు ఎక్కడ అమలయ్యాయని నిలదీశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు.గురుకులాల సంఖ్యను 294 నుంచి వెయ్యికి పైగా పెంచడంతో పాటు జూనియర్ కళాశాలలు,ప్రత్యేక మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేశామని చెప్పారు.మన ఊరు మన బడి,మన బస్తీ మన బడి కార్యక్రమాల ద్వారా రూ.7,900 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టామని వివరించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు,యూనివర్సిటీల బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.మహాత్మా జ్యోతిబా పూలే,అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల వరకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ మరింత ఉధృతంగా పోరాటాలు చేపడుతుందని స్పష్టం చేశారు.యువతకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,యువజన నాయకులు,విద్యార్థులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట

## విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పరకాల, నేటిధాత్రి:
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు.ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,విద్యాబోధన,అల్పాహారం,మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.పిల్లలే రేపటి దేశ పౌరులనే ఆలోచనతో వారి ఆరోగ్యం,విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.ఇందులో భాగంగానే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులతో పాటు ఉచితంగా నాణ్యమైన విద్య,ఉదయం అల్పాహారం,మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా మెరుగైన విద్యా వాతావరణం కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చందానగర్‌లో బీఆర్ఎస్ ధర్నా



- భారీ నిరసన ప్రదర్శనతో హోరెత్తిన చందానగర్
- ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బొబ్బా నవతారెడ్డి ఆరోపణ

శేరిలింగంపల్లి, నేటిధాత్రి:
అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి, ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు గడిచినా హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్ డివిజన్ కేంద్రంలో ధర్నా, భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచనలతో బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బా నవతారెడ్డి నేతృత్వంలో కార్యక్రమం చేపట్టారు. చందానగర్ ప్రధాన రహదారిపై కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా బొబ్బా నవతారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత దళితబంధు పథకాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు.
రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంక్షలు విధించారని ఆరోపించారు. ఎకరాకు ఏటా రూ.15 వేల రైతు భరోసా, వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం వంటి హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు భృతి, విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పాటు తులం బంగారం హామీ కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రజల హక్కుల సాధన కోసం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బొబ్బా నవతారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, కోమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌శర్మ, శ్రీకాంత్‌తో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మొయినాబాద్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీల ఎన్నిక

- మండల అధ్యక్షులుగా రామగళ్ల కుమార్ మాదిగ, దర్గుపల్లి రాజు మాదిగ
- దండోరా ఉద్యమాన్ని మాదిగ వాడలకు తీసుకెళ్లాలి: రాగళ్ల ఉపేందర్ మాదిగ

మొయినాబాద్, నేటిధాత్రి:
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నూతన మండల కమిటీలను శుక్రవారం ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన మండల కమిటీల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంఎస్ఎస్ గార్డెన్స్‌లో ఎంఆర్‌పీఎస్, అనుబంధ విభాగాల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి కొండిగారి మహేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మొయినాబాద్ మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా సురంగల్ గ్రామానికి చెందిన రామగళ్ల కుమార్ మాదిగను, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన దర్గుపల్లి రాజు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ హాజరై ఉద్యమ ఆవశ్యకత, ప్రస్తుత పరిణామాలు, భవిష్యత్ లక్ష్యాలు, నాయకుల కర్తవ్యాలపై వివరించారు. మందకృష్ణ మాదిగ సందేశాన్ని నాయకులు, కార్యకర్తలకు వివరించారు.
మాదిగలు సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యాన్ని అందిపుచ్చుకుని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఐక్యంగా ఉద్యమించాలని ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. దండోరా ఉద్యమాన్ని మాదిగ వాడలకు తీసుకెళ్లడంతో పాటు చదువుకున్న యువతకు నాయకత్వ లక్షణాలను పెంపొందించి జాతికి నాయకత్వం వహించేలా తీర్చిదిద్దాలని, సమసమాజ స్థాపన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ, ఎలక్ట్రిసిటీ శాఖ ఏఈ, ఎంఈఎఫ్ నాయకులు శ్రీనివాస్, చేవెళ్ల ఇన్‌చార్జి బ్యాతాల శివశంకర్ మాదిగ, ఊరంట ప్రవీణ్ మాదిగ, మల్లేష్ మాదిగ, బోడ భాస్కర్ మాదిగ, సిరిగిరి కృష్ణ మాదిగతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గురువులే విద్యార్థులకు మార్గదర్శకులు

- పర్లపల్లి ఎస్వీ విద్యాలయంలో ఘనంగా గురు దినోత్సవ వేడుకలు
- ఉపాధ్యాయులకు ఘన సన్మానం..విద్యార్థుల ప్రేమాభిమానాలు



మొగుళ్లపల్లి, నేటిధాత్రి:
పర్లపల్లి ఎస్వీ విద్యాలయంలో గురు దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మోరే రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షల కార్డులు, కలాలు అందజేశారు.
ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే శిల్పులని, ప్రతి విజయం వెనుక గురువు కృషి ఉంటుందని అన్నారు. గురువులను గౌరవించి, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడమే విద్యార్థులు అందించే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ




- ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి నేటిధాత్రి
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల పాలన విజయోత్సవ ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్‌షో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అప్పుల ఊబిలోకి వెళ్లిందని ఆరోపించారు. దళిత సీఎం, మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రుణమాఫీ వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 26.70 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ, పేదలకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టిందని గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గానికి రూ.31 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించామని పేర్కొన్నారు. డీబీఎం-38 ద్వారా గోరుకొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలాల్లో 44,700 ఎకరాలకు దేవాదుల నీటిని అందించేందుకు రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. గడప సముద్రం, భీమ్‌గన్‌పూర్ చెరువులకు సిమెంట్ లైనింగ్ పనులకు మంజూర్లు వచ్చాయని, త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలకు తమ ప్రభుత్వంలో చోటు లేదని, తప్పు చేసే అధికారులు, దళారులు, రౌడీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెయ్యి రోజుల్లో నియోజకవర్గానికి తెచ్చిన నిధులు, గత పాలనలో తెచ్చిన నిధులపై లెక్కలు చూపిస్తామని, భూపాలపల్లిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు అరుణ్ రావు అప్పం కిషన్, బొడ్డు అశోక్, కురిమిళ్ళ శ్రీనివాసు రాజు నాయక్ నాయకులు పిప్పాల రాజేందర్, వెంకీ యాదవ్ మట్టేవాడ సురేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవే సంతృప్తి.. మానవత్వమే మహోన్నతి



- మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- పేదలు, నిరాశ్రయుల సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు: రాజు నేత

యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
మానవ సేవకు తన జీవితాన్ని అంకితం చేసి ప్రపంచవ్యాప్తంగా సేవా స్ఫూర్తిని చాటిన మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాజు నేత ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు నేత మాట్లాడుతూ.. “సేవ యొక్క ఫలితం సంతృప్తి” అనే సందేశంతో ప్రపంచానికి సేవా మార్గాన్ని చూపించిన మదర్ థెరిసా మహా మానవతామూర్తి అని కొనియాడారు. పేదలు, అనాథలు, నిరాశ్రయులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.
ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి మానవత్వానికి గొప్ప నిర్వచనం ఇచ్చారని అన్నారు. ఆమె చూపిన సేవా మార్గం, కరుణ, ప్రేమ, మానవతా విలువలు నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాల కన్నీటిని తుడవడమే నిజమైన మానవత్వమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని రాజు నేత పిలుపునిచ్చారు. పేదలు, వృద్ధులు, అనాథలు, ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. మదర్ థెరిసా ఆశయాలను ముందుకు తీసుకెళ్లి, ఆమె సేవా స్ఫూర్తిని ఆచరణలో పెట్టడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని రాజు నేత పేర్కొన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# కిరాణా దుకాణాల మాటున మద్యం దందా..?



- పట్టణం నుంచి పల్లెల వరకు బెల్ట్ షాపుల ఆరోపణలు
- రోడ్డు పక్కన..నివాస ప్రాంతాల సమీపంలోనూ మద్యం విక్రయాలు?
- యువతపై పెరుగుతున్న ప్రభావం..ఎక్సైజ్ శాఖ తనిఖీలు కోరుతున్నా ప్రజలు

పరకాల,నేటిధాత్రి
పరకాల పట్టణంతో పాటు పరకాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.పట్టణంలోని కొన్ని ప్రాంతాలతో పాటు గ్రామాల్లోనూ రోడ్డు పక్కన,నివాస ప్రాంతాల సమీపంలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కిరాణా దుకాణాలు,ఇతర వ్యాపార కేంద్రాల మాటున మద్యం విక్రయాలు సాగుతున్నాయనే విమర్శలు రావడంతో ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.పరకాల పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపుల తరహాలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.ప్రధాన రహదారులు, గల్లీలు,నివాస ప్రాంతాలకు సమీపంలో మద్యం సులభంగా లభిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇదే సమయంలో పలు గ్రామాల్లో కిరాణా దుకాణాల ముసుగులో మద్యం విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణం,గ్రామాలు అనే తేడా లేకుండా మద్యం అందుబాటులోకి వస్తుండటంతో యువతతో పాటు పలువురు మద్యానికి అలవాటుపడుతు న్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కుటుంబాలపై ఆర్థిక భారం,సామాజిక ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### కిరాణా దుకాణాల మాటున విక్రయాలా?

నిత్యావసర సరుకులు విక్రయించే కొన్ని కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నా యనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వలు,విక్రయాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సంబంధిత దుకాణాలకు మద్యం విక్రయాలకు అనుమతులు ఉన్నాయా?అనుమతుల పరిధిని దాటి విక్రయాలు సాగుతున్నాయా?అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు.

### ఎక్సైజ్ శాఖ తనిఖీలు ఎప్పుడు?

పట్టణంతో పాటు పరకాల పరిధిలో మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పుడు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపడతారనే ప్రశ్న స్థానికుల్లో వ్యక్తమవుతోంది.కిరాణా దుకాణాలు,రోడ్డు పక్కన ఉన్న వ్యాపార కేంద్రాలు,నివాస ప్రాంతాల సమీపంలో తనిఖీలు నిర్వహించి మద్యం నిల్వలు,విక్రయాలకు సంబంధించిన అనుమతులు,నిబంధనల అమలును పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.తనిఖీల్లో అనధికారికంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలు పునరావృతం కాకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.పట్టణం నుంచి గ్రామాల వరకు మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను అధికారులు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

### బెల్ట్ షాపులపై నిఘా పెంచాలి

పరకాల పట్టణంతో పాటు పల్లెల్లోనూ బెల్ట్ షాపుల తరహాలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.కిరాణా దుకాణాలు,చిన్నచిన్న వ్యాపార కేంద్రాల వద్ద మద్యం అమ్మకాలు జరుగుతున్నాయా అన్నది ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.ముఖ్యంగా రోడ్డు పక్కన,నివాస ప్రాంతాల సమీపంలో మద్యం సులభంగా దొరకకుండా చూడాలి.అధికారులు ముందస్తు సమాచారం కోసం ఎదురుచూడకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.పట్టణంతో పాటు పరకాల మండలంలోని గ్రామాలపై కూడా నిఘా పెట్టాలి.అనుమతులు లేకుండా మద్యం నిల్వలు,విక్రయాలు చేస్తున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.యువతను దృష్టిలో పెట్టుకుని అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బొచ్చు రాజు పరకాల

# 420 హామీలను అమలు చేయాలి: బీఆర్ఎస్ ర్యాలీ




- 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో కల్వకుర్తిలో భారీ నిరసన
- హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటం: ఉప్పల వెంకటేష్

కల్వకుర్తి, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కల్వకుర్తిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'కాంగ్రెస్ బాకీ కార్డు' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వివరిస్తూ భారీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు.
ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మిషన్ భగీరథ వైస్‌చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, కల్యాణలక్ష్మి--షాదీముబారక్ కింద తులం బంగారం వంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు.
రైతు భరోసా, రుణమాఫీ, వరి పంటకు రూ.500 బోనస్, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు, ఉచిత స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: ఉప్పల వెంకటేష్

ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, యాడ్మా సత్యం, గోవర్ధన్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు,తెలంగాణ ఉద్యమకారులు, వివిధ మండలాల అధ్యక్షు లు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 5 వేల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.
వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, వాకర్స్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# డీజే లకు అనుమతి లేదు..

**పెడితే చట్టపరమైన చర్యలు ఎస్సై నరేష్**



హుజూర్నగర్, నేటిధాత్రి :
పట్టణంతో పాటు మండల పరిధిలో ఎలాంటి శుభకార్యాలు పండుగలు లేదా ఊరేగిపులకైనా డీజే సౌండ్ సిస్టం లు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవని హుజూర్నగర్ ఎస్సై నరేష్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో డిజె ఆపరేటర్లు, నిర్వహకులతో ఎస్సై నరేష్ ప్రత్యేకంగా కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముత్యాలమ్మ పండుగ మరియు రాబోయే ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలో ప్రశాంతత వాతావరణాన్ని కాపాడడం తమ ప్రాధాన్యతని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి అవాంఛనీయంగా సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని స్పష్టం చేశారు. ప్రజలు ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీసుల నిబంధనలకు కట్టుబడి ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్సై నరేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది స్థానిక డిజె నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే



- బడుగుల పిల్లలకు తిండి పెట్టలేని దుస్థితి
- సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తాం
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ, నేటిధాత్రి:
ఎన్నికల్లో గెలిస్తే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పి గెలిచిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర ఏండ్లు కావస్తున్నప్పటికీ విద్యార్థి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించలేక అచేతనంగా ఉందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. శనివారం కోదాడ ప్రధాన రహదారిపై బీ ఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న. సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి. నిరసిస్తూ వందలాదిమంది విద్యార్థులు నిర్వహించిన నిరసన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు ఈ ర్యాలీ ఖమ్మం క్రాస్ రోడ్డు నుండి బస్టాండ్ మీదుగా రంగా థియేటర్ చౌరస్తా వరకు సాగింది...విద్యార్థుల ఫీజుల రీయింబర్స్మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాక కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు ..,... బకాయిలు అడిగిన విద్యాసంస్థల యాజమాన్యాలను ఈ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తోందని మండిపడ్డారు... అదేవిధంగా సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు కనీసం సరైన తిండి కూడా పెట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు.... పురుగుల అన్నం పెడుతుండటంతో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని, గురుకులాల్లో పాముకాట్లకు గురై విద్యార్థులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యం కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు... గురుకుల పాఠశాలలో పౌష్టికాహారానికి సంబంధించి నాలుగు నెలలుగా టెండర్లను ఖరారు చేయకుండా మంత్రులు తమ వాటాలు, కమీషన్ల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. మరోవైపు నిరుద్యోగులకు కొత్త జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నోటిఫికేషన్లు జారీ చేసి ఎంపిక చేసిన ఉద్యోగులకు ఈ ప్రభుత్వం నియామక పత్రాలను అందిస్తూ తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరమన్నారు .. .. తక్షణమే విద్యార్థులకు అందాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేసి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలనుపరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అడుగడుగునా ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని, హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ ఇన్చార్జి వంశీ, కౌన్సిలర్ చీమ నరేష్ వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డిపల్లిలో ఉట్టి కొట్టిన గణేష్ కళాబృందం



- రసవత్తరంగా సాగిన ఉట్టికొట్టే పోటీ
- విజేతలకు నగదు బహుమతులు అందజేసిన యాదవ సంఘం, ప్రజాప్రతినిధులు

వీణవంక,నేటిధాత్రి:
వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని శ్రీ మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉట్టికొట్టే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు జట్లుగా ఏర్పడి ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. రసవత్తరంగా సాగిన పోటీలో రాయణవేణి తిరుపతి, దూలం కనుకయ్య, నిమ్మల రాజయ్య నేతృత్వంలోని గణేష్ కళాబృందం ఉట్టి కొట్టి విజేతగా నిలిచింది. బృంద సభ్యులు రాయణవేణి తిరుపతి, దూలం కనుకయ్య, గోనెల నరేష్, అఖిల్, చందు, పూదరి హరీష్, గోనెల రిషికేష్, హర్షిత్, అరవింద్ సాయి, కర్రె పవన్, రాజేష్ ఉన్నారు.
విజేతలకు యాదవ సంఘం తరపున రూ.5,016, గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత రూ.2,016, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి రూ.3,016 నగదు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు

- ఈనెల 7న భూపాలపల్లి జెడ్పీ పాఠశాలలో శిబిరం
- ఉచిత ఉపకరణాల కోసం 150 మంది విద్యార్థులకు పరీక్షలు



భూపాలపల్లి, నేటిధాత్రి:
ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు ఈనెల 7న భూపాలపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.లలిత, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి సామల రమేష్ తెలిపారు. అలింకో, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గుర్తించిన 150 మంది విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపకరణాలు అవసరమైన విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించే వైకల్య ధ్రువపత్రం లేదా సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం లేదా రేషన్ కార్డు తీసుకుని శిబిరానికి హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రయాణ ఖర్చులు, భోజన వసతి కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలి

**సెప్టెంబర్ 8, 9న మంచిర్యాలలో మహాసభలు ...కాచారంలో పోస్టర్ ఆవిష్కరణ**



యాదగిరిగుట్ట, నేటిధాత్రి:
సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా బేజాడి కుమార్ మాట్లాడుతూ.. భారత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు, సరళీకరణ ఆర్థిక విధానాలే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపించారు. ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేసే కార్యాచరణ చేపట్టలేదని విమర్శించారు.
అనేక దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న అసమాన ఒప్పందాల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. ముఖ్యంగా అమెరికాతో చేసుకుంటున్న ఒప్పందాలు రైతాంగానికి నష్టదాయకంగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలిగించే అసమాన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
బహుళజాతి సంస్థలు ఉత్పత్తి చేస్తున్న విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా జరుగుతున్న విత్తన వ్యాపారాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.
మంచిర్యాలలో జరిగే రాష్ట్ర మహాసభల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. రైతు కూలీల హక్కుల కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించి, పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని బేజాడి కుమార్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బర్మా బాబు, సంఘం అధ్యక్షుడు గ్యార నరసింహులు, సుంచు రాములు, సుంచు ఆంజనేయులు, గ్యార మాతయ్య, వంగపల్లి మహంకాళి, బీబీనగరం నరసయ్య, బర్మా మల్లయ్య, ఐలయ్య, మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# గౌడ కులస్తులకు న్యాయం చేయాలి

**ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన**



వరంగల్, నేటిధాత్రి:
ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాలకు చెందిన గౌడ కులస్తుల భూమికి సంబంధించి నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ గౌడ కులస్తులు ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఉర్సు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 310, 332, 333, 334, 309లోని ఎకరం ఆరు గుంటల భూమి తమ కులానికి చెందినదని వారు తెలిపారు.
1994లో ఐదుగురు గౌడ కుల పెద్దల పేరుతో భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని, అయితే కొప్పుల మల్లేశం, మరికొందరు ప్రైవేటు వ్యక్తులు తమ పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారని గౌడ కులం అధ్యక్షుడు బత్తిని అఖిల్‌గౌడ్, సొసైటీ చైర్మన్ మండా వెంకన్నగౌడ్ ఆరోపించారు. ప్రస్తుతం సదరు భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు.
భూమిని సర్వే చేసి హద్దులు ఖరారు చేసి సుమారు 300 మంది గౌడ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎండీ. ఇక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో సర్వే నిర్వహించి భూమి హద్దులు ఖరారు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గౌడ కుల పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**విద్యార్థుల జీవితాలకు మార్గనిర్దేశం చేయడంలో గురువుల పాత్ర కీలకం**



పరకాల, నేటిధాత్రి:
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను సరైన మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.
వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.మల్లయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎ.అశోక్, తెలుగు అధ్యాపకులు ఈశ్వరయ్య ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

**సంప్రదించవలసిన చిరునామా..**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# ఆరోగ్యం కోసం స్త్రీలు ఈ 4 పనులు తప్పక చేయాలి

## నెలరోజుల్లోనే తేడా కనిపిస్తుంది!



డెస్క్,నేటిధాత్రి:
మహిళలు ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకొనే వరకు ఇంటాబయట పనులతో ఫుల్ బిజీగా ఉంటారు. నిమిషం తీరిక లేకుండా పనుల్లో నిమగ్నమైపోతారు. అయితే గృహ బాధ్యతల కారణంగా మహిళలు తరచుగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కానీ ఏ వయస్సులోనైనా, వారి జీవనశైలిని కొద్దిగా మార్చడం ద్వారా, వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, వ్యాధులను నివారించవచ్చు వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. కాబట్టి మహిళలు గుర్తుంచుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని ఆరోగ్యంగా ఉంచుకోగల ప్రాథమిక విషయాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

శారీరక శ్రమ: క్రమం తప్పకుండా వ్యాయామం చేసే స్త్రీలకు మెరుగైన రక్తపోటు కొలెస్ట్రాల్ స్థాయిలు ఉంటాయి. గుండె జబ్బులు, మధుమేహం , బీపీ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. మహిళలు మెనోపాజ్‌కు చేరుకోవడం , శారీరకంగా చురుకుగా ఉండటం వలన, వారు అనేక సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. కాబట్టి ప్రతి స్త్రీ వారానికి 4-5 రోజులు 30-60 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

### చక్కగా నిద్రపోండి:

ఆధునిక జీవనశైలి కారణంగా చాలా మంది మహిళలకు రాత్రిపూట నిద్రపోవడం కష్టంగా మారుతోంది. అయితే మీ ఇతర బాధ్యతల మాదిరిగానే నిద్రకు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్రాంతి తీసుకోవడానికి తగినంత నిద్ర పొందడం వలన మీరు ఆరోగ్యంగా ఉండటానికి , మీ శరీరాన్ని శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది.

శారీరక పరీక్ష : ఏటా మీ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని నిర్ధారించుకోండి, ఇది మీకు ఏదైనా తీవ్రమైన అనారోగ్యం వచ్చే ప్రమాదం నుంచి వెంటనే బయటపడేలా చేస్తుంది. అటువంటి పరిస్థితిలో, వైద్యులు అధిక రక్తపోటు , అధిక స్థాయి అనారోగ్య కొలెస్ట్రాల్ వంటి ప్రాథమిక విషయాలను తనిఖీ చేస్తారు.

### ఆహారంపై శ్రద్ధ వహించండి:

మీరు తినే దానిపై శ్రద్ధ వహించండి. ఆరోగ్యకరమైన ఆహారం అంటే రుచి లేని ఆహారం కాదు. బదులుగా, ఇది ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు , కార్బోహైడ్రేట్లతో కూడిన భోజనం తినాలి . మీరు దీనికి రకరకాల కూరగాయలు , పండ్లను జోడించవచ్చు.

# చలికాలంలో జలుబు, దగ్గు వేధిస్తోందా?

- "ఉసిరి టీ" తాగితే మంచిదట! - పైగా ఈ ప్రయోజనాలు కూడా! ఆయుర్వేదంలో ఉసిరి వినియోగం అధికం
- ఇండియన్ గూస్ బెర్రీతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు



హైదరబాద్,నేటిధాత్రి:
చలికాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుంది. ఈ సీజన్‌లో శరీరం నిస్తేజంగా మారడమే కాదు.. వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేగంగా శరీరంలోకి చేరి.. జలుబు, దగ్గు, జ్వరాలు ఇబ్బందిపెడుతుంటాయి. ఇలాంటి సమయంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు తీసుకోవాలి. తద్వారా ఎలాంటి రోగాలతో అయినా పోరాడే సామర్థ్యం లభిస్తుంది. అలా ఇమ్యూనిటీ అందించే ఫుడ్స్?లో ఉసిరితో తయారయ్యే టీ కూడా ఒకటి. మరి దీని వల్ల కలిగే ప్రయోజనాలు, ఎలా తయారు చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం..

### ఉసిరి టీ ఆరోగ్య ప్రయోజనాలు:

రోగ నిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుందని.. ఫలితంగా శరీరం బాక్టీరియా, వైరస్‌లతో సమర్థవంతంగా పోరాడగలుగుతుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శుభాంగి తమ్మళ్వార్ అంటున్నారు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు జలుబు వల్ల కలిగే గొంతు నొప్పి, వాపు వంటి లక్షణాలను తగ్గిస్తాయని అంటున్నారు.

జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది : ఉసిరి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు. ముఖ్యంగా మలబద్ధకాన్ని నివారిస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఉసిరి.. జీర్ణ రసాల స్రావాన్నీ ప్రేరేపించి పోషకాల శోషణను మెరుగుపరుస్తుందని.. ఫలితంగా అజీర్ణం, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గిపోతాయంటున్నారు.

కళ్ల ఆరోగ్యానికి మంచిది: ఉసిరి కళ్ల ఆరోగ్యానికి చాలా మంచిదని అంటున్నారు. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుందని, గ్లాకోమా వంటి కంటి సమస్యలను నివారిస్తుందని అంటున్నారు. అలాగే ఉసిరిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కంటి వాపును తగ్గించి.. కంటి ఎరుపు, దురద వంటి సమస్యలను తగ్గిస్తుందని చెబుతున్నారు.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: ఉసిరిలో యాంటీ-డయాబెటిక్ లక్షణాలు అధిక పరిమాణంలో ఉంటాయని.. రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయని అంటున్నారు. 2020లో జర్నల్? ఆఫ్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ఆమ్లా సారం గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుందని, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుందని కనుగొన్నారు.

కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుందని అంటున్నారు. తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గుతుందని అంటున్నారు.

ఫ్రీ రాడికల్స్ నష్టం తగ్గుతుంది : ఉసిరిలోని విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు. అలాగే ఈ పండులో పాలీఫెనాల్స్, టానిన్, ఫ్లేవనాయిడ్లు ఉంటాయని.. ఇవన్నీ శరీరాన్ని ఆక్సిడేటివ్ స్ట్రెస్, ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుంచి రక్షించడంలో చాలా బాగా సహాయపడతాయంటున్నారు.

జుట్టు, చర్మ ఆరోగ్యానికి మేలు : ఉసిరిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు జుట్టు, చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా వెంట్రుకల కుదుళ్లు బలంగా మారి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుందంటున్నారు. అలాగే, ఉసిరి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు స్కిన్ ఇరిటేషన్, మొటిమలను తగ్గిస్తాయని.. వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తాయంటున్నారు.

క్యాన్సర్?ను నిరోధించడం: ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడతాయని అంటున్నారు. ఇదే విషయాన్ని %చీ×ఎ% సభ్యుల బృందం కూడా స్పష్టం చేసింది.(రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్?చేయండి).

ఉసిరి టీ ఎలా తయారు చేయాలంటే: గిన్నెలోకి ఓ గ్లాస్ నీళ్లు పోసి చెంచా ఎండబెట్టిన ఉసిరి పొడి, కొద్దిగా అల్లం తరుగు, రెండు తులసి ఆకులు, చిటికెడు వేయించిన జీలకర్రపొడిని వేసి బాగా మరగబెట్టాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు తేనె, నిమ్మరసం చేర్చి తాగితే సరి. లేదంటే తాజా ఉసిరికాయను తురిమి మిక్సీలో పేస్టులా చేసుకోవాలి. దాన్ని నీళ్లలో మరిగించి కూడా టీ రూపంలో తీసుకోవచ్చు.

NOTE : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.



# విద్యార్థి శక్తిని అడ్డుకోలేరు!

- కొత్తగూడెంలో 3 వేల మందితో ఎంపీ వద్దిరాజు భారీ పాదయాత్ర
- జీవో 97 రద్దు చేయాలి.. రూ.13 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- ఖాళీ ఉద్యోగాలన్నింటికీ తక్షణమే నోటిఫికేషన్లు ఇవ్వాలి: వద్దిరాజు



కొత్తగూడెం, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో కొత్తగూడెంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతతో భారీ పాదయాత్ర నిర్వహించారు. సుమారు 3 వేల మంది పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు గుదిబండగా మారిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని, రూ. 13 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేసేందుకు తక్షణమే నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి వారి పోరాటమే గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. "విద్యార్థి శక్తి ముందు ఎంతటి పాలకుడైనా తలవంచాల్సిందే" అని వద్దిరాజు స్పష్టం చేశారు.

# వెయ్యి రోజుల మోసం...

## రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి!



కరీంనగర్, నేటిధాత్రి:
తెలంగాణ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చారని.. వాటిలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువభేరి, నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

### 100 రోజుల హామీ.. వెయ్యి రోజుల మోసం

ఎన్నికల సమయంలో 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు పెద్ద పెద్ద మాటలు చెప్పారని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు 100 రోజులు కాస్తా వెయ్యి రోజులకు చేరుకున్నాయని.. 100 రోజులకు పది రెట్లు సమయం గడిచినా ప్రజలకు ఏం చేశారో చెప్పే పరిస్థితి లేదని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు నోటిఫికేషన్లు లేవని, ఉద్యోగాలు లేవని.. లూటిఫికేషన్లు మాత్రం బ్రహ్మాండంగా సాగుతున్నాయని ఎద్దేవా చేశారు.

### "కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?"

తెలంగాణను సాధించిన కేసీఆర్ రాజీనామా చేయాలా? ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తాను అడిగిన ప్రశ్నకు యువత, విద్యార్థులు ముక్తకంఠంతో "రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి" అని సమాధానం ఇచ్చారని తెలిపారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### "ఒక్క మంత్రిని కాదు.. ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు"

ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కేటీఆర్ హెచ్చరించారు. పేద ప్రజల భూములతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. కోట్ల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టారని.. ఇదే విధంగా కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజులు కూడా దగ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు.

### "2 లక్షల ఉద్యోగాలంటూ యువతను మోసం చేశారు"

365 రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఉద్యోగాల కోసం యువత తల్లిదండ్రులు, బంధువుల కాళ్లు మొక్కే పరిస్థితి తెచ్చి.. వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించిందని ఆరోపించారు.

### ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 2.32 లక్షల ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వంతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. యువతకు నైపుణ్యాలు లేవంటున్న రేవంత్‌రెడ్డి.. ముందుగా తన ప్రభుత్వ వైఫల్యాలను సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్‌తో పెట్టుకోవద్దు..

కేసీఆర్‌తో పెట్టుకోవద్దని కేటీఆర్ హెచ్చరించారు. కమీషన్ల కోసం మంత్రులు పరస్పరం కొట్టుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు, యువత, రైతులు, పేదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పే రోజులు ముందున్నాయని కేటీఆర్ అన్నారు.



# రైతుల భూ సమస్యలకు రీ సర్వేతో పరిష్కారం

### వరంగల్ ఆర్డీఓ సుమ



రాయపర్తి, నేటిధాత్రి:
రైతుల భూ సరిహద్దులు, విస్తీర్ణం తదితర సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని వరంగల్ ఆర్డీఓ సుమ తెలిపారు. రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పరిశీలించారు.
ఈ సందర్భంగా రైతులకు రీ సర్వే ప్రక్రియ, దాని ప్రయోజనాలను వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు అవుతాయని తెలిపారు. రీ సర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే సమయంలో అవసరమైన భూ పత్రాలను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు, తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు సక్రమంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిందే

- 22ఏ జాబితాలో చేర్చడంపై సింఫనీ పార్క్ హోమ్స్ వాసుల ఆవేదన
- తప్పులకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి: ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, నేటిధాత్రి:
ప్రజల ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో నిర్వహించిన 22ఏపై సమావేశానికి ఆయన హాజరై కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1,500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నామని కాలనీ వాసులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో నిర్మించిన కాలనీని, 12 ఏళ్ల తర్వాత 22ఏ జాబితాలో చేర్చడం ఎలా సాధ్యమని రఘునందన్‌రావు ప్రశ్నించారు. రూపాయి రూపాయి కూడబెట్టి, బ్యాంకు రుణాలు తీసుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చడం బాధాకరమన్నారు. ప్రజల పక్షాన పోరాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ మంత్రి క్షమాపణ చెబితే సరిపోదని, జరిగిన తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో భూములు, ఇళ్లను చేర్చడంలో జరిగిన తప్పులకు బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# వర్ధన్నపేట గడ్డపై కదం తొక్కిన విద్యార్థి లోకం!

- విద్యార్థులు, నిరుద్యోగులతో అరూరి భారీ ర్యాలీ
- ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తల యత్నం
- భీమారంలో భారీగా పోలీస్ బలగాలు.. ఉద్రిక్తత

వర్ధన్నపేట, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్యార్థులు, నిరుద్యోగులతో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ భారీ ర్యాలీ నిర్వహించారు. భీమారం జంక్షన్ నుంచి ఎర్రగట్టుగుట్ట జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీల అమలు కోరుతూ నినాదాలు చేశారు.
ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన రూ. 11,300 కోట్ల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని అరూరి డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే జీవో 97ను రద్దు చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్డెక్కే పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.
ర్యాలీకి వస్తున్న మద్దతును చూసి కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారని బీఆర్ఎస్ నేతలు



ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొనగా.. భీమారం ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు. యువత హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అరూరి హెచ్చరించారు.

# గుండు సుధారాణికి ముదిరాజ్ సంఘం శుభాకాంక్షలు



వరంగల్, నేటిధాత్రి:
కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా నియమితులై శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణిని కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. సంఘం అధ్యక్షుడు బిల్ల శివశంకర్ ముదిరాజ్ నేతృత్వంలో ప్రతినిధులు కుడా కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, వరంగల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి ముదిరాజ్, కాశిబుగ్గ ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కేశబోయిన దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కూరాకుల చంద్రశేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# పేదరికం కష్టాల నుంచి... బిలియనీర్ స్థాయి వరకు...

నేటిధాత్రి exclusive

## మై హోమ్స్ రామేశ్వరరావు విజయ ప్రస్థానం






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888




మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

మొదటి పేజీ తరువాయి

### హైదరాబాద్‌కు రాక

పట్టుదలతో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, ఎలాగైనా డాక్టర్ కావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడ ప్రభుత్వ పొట్టి శ్రీరాములు నెహ్రూ హోమియోపతి వైద్య కళాశాలలోసీటు సంపాదించి, విజయవం తంగా హోమియోపతిలో గ్రాడ్యుయేషన్ (బీహెచ్ ఎంఎస్) పూర్తి చేశారు. హైదరాబాద్ వచ్చిన కొత్తలో ఆయనకు ఉండటానికి సరైన వసతి లేదు. కాలేజీ హాస్టల్‌లోనే ఉంటూ చదువుకునేవారు. ఆ రోజుల్లో జేబులో తగినంత డబ్బు లేక, కనీస అవసరాల కోసం కూడా ఎంతో పొదుపుగా జీవించాల్సి వచ్చేది. కాలేజీ రోజుల్లోనే ఆయనలోని నాయకత్వ లక్షణాలు బయటపడ్డాయి. విద్యార్థుల సమస్యలపై, హాస్టల్ వసతులపై నిలదీస్తూ ఆయన విద్యార్థి సంఘం నాయకుడిగా ఎదిగారు. ఎన్నో సమ్మెలు, ధర్నాలకు నాయకత్వం వహించారు. ఈ విద్యార్థి రాజకీయాల వల్లే ఆయనకు హైదరాబాద్‌లోని పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఈ పరిచయాలే భవిష్యత్తులో ఆయన వ్యాపార రంగానికి పునాదిగా మారాయి. అంతేకాదు కాలేజీ రోజుల్లో పడిన కష్టాలు, చేసిన పోరాటాలే ఆయనలో జీవితంపై ఒక బలమైన అవగాహనను, భవిష్యత్తులో పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపించే మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంచాయి. చిన్నప్పుడు చదువు కోసం అన్ని కష్టాలు పడ్డారు కాబట్టే, నేడు ఆయన విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన 'మెరు ఇంటర్నేషనల్ స్కూల్' ను స్థాపించి వేలాది మంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

### చిన్న గదిలో క్లినిక్ ప్రారంభం

హోమియోపతి వైద్య విద్య పూర్తి కాగానే, ఆయన హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా సమీపంలో ఒక చిన్న గదిని అద్దెకు తీసుకుని క్లినిక్‌ను ప్రారంభించారు.ఆ రోజుల్లో దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం ఇప్పుడంతగా అభివఅద్ధి చెందలేదు.తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడంతోచుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల నుండి రోగులు ఆయన క్లినిక్‌కు వచ్చేవారు. తక్కువ సమ యంలోనే ఆయన నమ్మకమైన డాక్టర్‌గా పేరొందారు.డాక్టర్‌గా మంచి పేరు వచ్చిన ప్పటికీ, హోమియోపతి వైద్యం ద్వారా వచ్చే ఆదాయం చాలా పరిమి తంగా ఉండేది. నెలకు కేవలం కొన్ని వేల రూపాయల (సుమారు రూ. 15,000 లోపు) ఆదాయంతోనే ఆయన కుటుంబం గడవాల్సి వచ్చేది. ఆయన క్లినిక్‌కు వచ్చే రోగులలో సాధారణ ప్రజలతో పాటు కొందరు స్థానిక ల్యాండ్ డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఉండేవారు.మందులు ఇస్తూనే, రామేశ్వరరావు వారితో హైదరాబాద్‌లో భూముల వ్యాపారం, రియల్ ఎస్టేట్ రంగం ఎలా అభివఅద్ధి చెందుతోంది అనే విషయాలను అడిగి తెలుసుకు నేవారు. రోగులతో మాట్లాడే క్రమంలోనే ఆయనకు రియల్ ఎ స్టేట్ రంగంపై ఆసక్తి పెరిగింది. డాక్టర్‌గా కేవలం రోగాలను మాత్రమే నయం చేయగలనని, కానీ పెద్ద ఎత్తున నలుగురికీ ఉపాధి కల్పించా లన్నా, ఆర్థికంగా స్థిరపడాలన్నా వ్యాపార రంగమే స రైనదని ఆయన భావించారు.

### దశను మార్చిన ఒక్క 'సాహసం'!

క్లినిక్ నడుపుతున్న రోజుల్లోనే ఆయన క్లినిక్‌కు వచ్చే ఒక స్నేహితుడు/ రోగి హైదరాబాద్ శివార్లలో భూముల ధరలు పెరుగుతు న్నాయని, పెట్టుబడి పెట్టడం మంచిదని సలహా ఇచ్చారు. అప్పటికి రామేశ్వర రావు దగ్గర అంత పెద్ద మొత్తం లేదు. కానీ నగర విస్తరణను అంచనా వేసి, ఎంతో కష్టపడి రూ.50,000 సమకూర్చారు.ఆ డబ్బుతో హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో (దిల్ సుఖ్‌నగర్ లేదా హయాత్‌నగర్ పరిసరాల్లో) ఒక చిన్న భూమిని కొనుగోలు చేశారు. ల్యాండ్ కొన్న కొద్ది కాలానికే ఆ ప్రాంతంలో ఊహించని విధంగా అభివఅద్ధి జరిగి, భూమి ధరలు ఆకాశా న్నంటాయి. ఆయన కొన్న భూమి విలువ ఏకంగా మూడు రెట్లు (300%) పెరిగింది. ఈ మొదటి విజయమే ఆయనకు రియల్ ఎస్టేట్ రంగంపై పూర్తి నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. మొదటి డీల్‌తో వచ్చిన లాభాన్ని చూసి, కేవలం క్లినిక్‌కే పరిమితం కాకుండా పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్‌వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. అలా 1981లో "మై హోమ్ కన్స్ట్రక్షన్స్" సంస్థకు పునాది పడింది. ఆ రోజుల్లో రియల్ ఎస్టేట్ రంగంలో నాణ్యత లోపం, డెలివరీలో ఆలస్యం వంటి సమస్యలు ఎక్కువగా ఉండేవి. రామేశ్వరరావు "నాణ్యత, సమయపాలన, కస్టమర్ నమ్మకం"అనే మూడు సూత్రాలను తన వ్యాపార నినాదాలుగా మార్చుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌గర్‌పరిసర ప్రాంతాలలో చిన్న చిన్న అపార్ట్ మెంట్ ప్రాజెక్టలతో ప్రస్థానాన్ని ప్రారంభిం చారు. వారు నిర్మించిన ఇళ్ల నాణ్యత చూసి కస్టమర్లు మై హోమ్ సంస్థను నమ్మడం మొదలు పెట్టారు. 1990ల చివరలో మరియు 2000ల ప్రారంభంలో హైదరాబాద్‌లో ఐటీ రంగం రాబోతోందని ఆయన ముందే ఊహిం చారు. పశ్చిమ హైదరాబాద్ (గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్) వైపు భూములు సేకరించి భారీ మైండ్ స్పేస్ ప్రాజెక్టలు, మెగా గేటెడ్ కమ్యూనిటీలను నిర్మించారు. మి యాపూర్‌లో నిర్మించిన 'మై హోమ్ జ్యువెల్' సుమారు 2,000 పైగా ఫ్లాట్లతో అప్పట్లోనే హైదరాబాద్‌లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీలలో ఒకటిగా రికార్డు సఅష్టించింది. ఆ తర్వాత వచ్చిన విహంగ, అవతార్, భూజా, క్రిస్కా వంటి ప్రాజెక్టలు మై హోమ్ బ్రాండ్‌ను లగ్జరీకి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశాయి.

### సొంతంగా సిమెంట్ ప్లాంట్

మై హోమ్ కన్స్ట్రక్షన్స్ ద్వారా భారీ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మిస్తున్నప్పుడు సిమెంట్ కొరత, ధరల హెచ్చుతగ్గులు ప్రధాన సవాలుగా మారాయి. నిర్మాణ రంగంలో నాణ్యత తగ్గ కూడదంటే సొంతంగా సిమెంట్ ప్లాంట్ ఉండాలని ఆయన భావించారు. దీనినే వ్యాపార పరిభాషలో 'బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్' అంటారు. అంటే మన వ్యాపారానికి కావలసిన ముడిసరుకును మనమే తయారు చేసుకోవడం. 1998లో నల్గండ జిల్లా (ప్రస్తుతం సూర్యాపేట) మేళ్లచెరువు వద్ద లభ్యమయ్యే నాణ్యమైన సున్నపురాయి నిల్వలను గుర్తించి, అక్కడ మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంహెచ్ ఐసీఎల్) సంస్థను స్థాపించారు. మార్కెట్లోకి 'మహా సిమెంట్' పేరుతో ప్రవే శించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకపోవడంతో, అతి తక్కువ కాలంలోనే బిల్డర్లు, సాధారణ ప్రజల నమ్మకాన్ని ఈ బ్రాండ్ సొంతం చేసుకుంది. మహా సిమెంట్ వఅద్ధిని గమనించిన ఐర్లాండ్‌కు చెందిన అంతర్జాతీయ సిమెంట్ దిగ్గజం సీఆర్ హెచ్ పీఎల్‌సి, 2008లో మై హోమ్ ఇండస్ట్రీస్‌లో 50% వాటాను భారీ పెట్టుబడితో కొనుగోలు చేసింది. ఈ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి సాంకేతికత, మేనేజ్‌మెంట్ పద్ధతులు తోడై మహా సిమెంట్ ఉత్పత్తి సామ ర్థ్యం ఐదు రెట్లు పెరిగింది. ప్రారంభంలో ఏడాదికి కొన్ని లక్షల టన్నుల సామర్థ్యంతో మొదలై, నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్లాంట్ల ద్వారా ఏడాదికి 10 మిలియన్ టన్నులకు (1 కోటి టన్నులు) పైగా సిమెంట్ ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగింది.ప్రస్తుతం మహా సి మెంట్ కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మరియు ఒడిశా రా ష్ట్రాల్లో కూడా అత్యధికంగా అమ్ముడయ్యే టాప్ సిమెంట్ బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది.

### మీడియా రంగంపై దృష్టి

రియల్ ఎస్టేట్ మరియు సిమెంట్ రంగాలలో తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించిన తర్వాత, డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు సమాజంలో అత్యంత ప్రభావవంతమైన మీడియా మరియు వినోద రంగం పై దఅష్టి పెట్టారు. మీడియా రంగంలోకి ప్రవేశించే వ్యూహంతో మై హోమ్ గ్రూప్ మొదట ప్రముఖ తెలుగు న్యూస్ ఛానెల్ అయిన 10టీవీ లో పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత ఈ ఛానెల్ మెజారిటీ వాటాలను మరియు పూర్తి నిర్వహణ బాధ్యతలను మై హోమ్ గ్రూప్ తన చేతుల్లోకి తీసుకుంది. 2018 ఆగస్టులో మై హోమ్ గ్రూప్ మీడియా రంగంలోనే ఒక అతిపెద్ద సంచలనానికి తెరలేపింది. టీవీ9 నెట్‌వర్క్‌ను నడుపుతున్న 'అసోసియేటెడ్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెట్ (ఏబీసీఎల్) లోని మెజారిటీ వాటాలను (సుమారు 90% పైగా) మై హోమ్ గ్రూప్ (అలేతేదో మీడియా ద్వారా) మరియు మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్) సంస్థలు కలిసి కొనుగోలు చేశాయి. కేవలం తెలుగులోనే కాకుండా కన్నడ, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మరియు దేశంలోనే నంబర్ 1 హిందీ న్యూస్ ఛానెల్ అయిన టీవీ9 భారత్‌వర్ష్ లతో కూడిన దేశంలోనే అతిపెద్ద న్యూస్ నెట్‌వర్క్ మై హోమ్ గ్రూప్ భాగస్వామ్యంలోకి వచ్చింది.

### గీతా ఆర్ట్స్‌తో కలిసి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

కరోనా సమయంలో డిజిటల్ వినోదానికి ఉన్న క్రేజ్‌ను మై హోమ్ గ్రూప్ ముందే గుర్తించింది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ 'గీతా ఆర్ట్స్' సంస్థతో చేతులు కలిపి 2020లో పూర్తిగా తెలుగు కంటెంట్‌తో ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. ఈ జాయింట్ వెంచర్‌లో మై హోమ్ గ్రూప్ భారీగా పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుతం 'అహా' తెలుగుతో పాటు తమిళం లోనూ విస్తరించి, కోట్లాది మంది సబ్‌స్క్రైబర్లతో ప్రాంతీయ ఓటీటీ రంగంలో దూసుకుపోతోంది. ఈ విధంగా కేవలం ఇళ్లు నిర్మించడమే కాకుండా, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే వార్తా రంగంలోనూ , వారిని అలరించే వినోద రంగంలోనూ మై హోమ్ గ్రూప్ తన విజయకేతనాన్ని ఎగరవేసింది.

### సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో ప్రవేశం

డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు వ్యాపారవేత్తగానే కాకుండా సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో కూడా ఎంతో చురుగ్గా పాల్గొంటున్నారు.రామేశ్వరరావు జీవితంలో ఆధ్యాత్మికతకు చాలా పెద్ద పీట వేశారు. ముఖ్యంగా ప్రముఖ వైష్ణవ గురువు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామికి ఆయన పరమ భక్తుడు. హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్ (శ్రీరామనగరం) లో నిర్మించిన 216 అ డుగుల శ్రీ రామానుజాచార్యుల విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ) నిర్మాణంలో రామేశ్వరరావు మరియు మై హోమ్ గ్రూప్ అత్యంత కీలక పాత్ర పోషించారు. 11వ శతాబ్దపు సామాజిక సంస్కర్త అయిన రామానుజాచార్యుల సందేశాన్ని (సమాజంలో అందరూ సమానులే అనే భావనను) ప్రపంచానికి చాటడానికి ఈ కేంద్రాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ కోసం మై హోమ్ గ్రూప్ వందల కోట్ల రూపాయల విరాళాన్ని అందించడమే కాకుండా, నిర్మాణ పనులన్నింటినీ దగ్గరుండి ప ర్యవేక్షించింది.

### పవిత్రమైన గురుశిష్య బంధం

డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు మరియు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మధ్య ఉన్న గు రు-శిష్య బంధం చాలా ప్రత్యేకమైనది మరియు పవిత్రమైనది. ఒక సాధారణ వ్యాపారవేత్త స్థా యి నుండి స్వామివారికి అత్యంత ఆప్తుడిగా, ప్రధాన శిష్యుడిగా రామేశ్వరరావు మారడం వెనుక ఉన్న ఆధ్యాత్మిక ప్రస్థానం అత్యంత ఆసక్తికరమైంది. 1970ల చివరలో మరియు 1980ల ప్రారంభంలో ఇద్దరి ప్రస్థానాలు హైదరాబాద్‌లోనే మొదలయ్యాయి. రామేశ్వరరావు హోమియోపతి క్లినిక్ ముగించుకుని రియల్ ఎస్టేట్ రంగంలోకి (1981) అడుగుపెడుతున్న సమయంలోనే, శ్రీ చినజీయర్ స్వామి 1980లో సన్యాస ఆశ్రమాన్ని స్వీకరించి వైష్ణవ ధర్మ ప్రచారాన్ని ప్రారంభించారు. వేద సంస్కఅతి, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల రామేశ్వరరావుకు చిన్నప్పటి నుంచే మ క్కువ ఉండేది. ఈ క్రమంలోనే ఒక ఆధ్యాత్మిక సత్సంగంలో ఆయనకు చినజీయర్ స్వామితో మొదటి పరిచయం ఏర్పడింది. సాధారణంగా వ్యాపారవేత్తలలో ఉండే అహంకారం రామేశ్వరరావులో లేకపోవడాన్ని స్వామివారు గమనించారు. తన వ్యాపార ఎదుగుదల అంతా భగవంతుడి కఅ పే అని నమ్మే రామేశ్వరరావు నిరాడంబరత, గురుభక్తి స్వామివారిని ఎంతగానో ఆకట్టుకున్నా యి. తన ఉద్యోగులను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకునే ఆయన గుణం స్వామివారికి మ రింత నచ్చింది. రామేశ్వరరావు హోమియోపతి డాక్టర్ కావడంతో, తన సంపాదనను పేద ప్రజల ఆరోగ్య సేవలకు ఉ పయోగించాలని అనుకున్నారు. చినజీయర్ స్వామి వారి సామాజిక సేవాదఅక్పథానికి ఆకర్షితులైన రామేశ్వరరావు .. స్వామివారి జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జేఈటీ) లోభాగస్వామి అయ్యారు. ఇద్దరి కలయికతో శంషాబాద్ సమీపంలోని జివా (జీవా) ఆశ్రమంలో జేఐఎంఎస్ హోమియోపతి ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజీని స్థాపించి, వేలాది మంది పేదల కు ఉచిత వైద్యం అందించడం ప్రారంభించారు. ఈ గురు-శిష్య బంధానికి ఒక చారిత్రాత్మక నిదర్శనం.. ముచ్చింతల్‌లో నిర్మించిన 216 అడుగుల శ్రీ రామానుజాచార్యుల విగ్రహం. 11వ శతాబ్దంలోనే సమాజంలో అందరూ సమానులే అని చాటిన రామానుజాచార్యుల విగ్రహాన్ని ప్రతి ష్ఠించాలనేది స్వామివారి సంకల్పం. ఆ గురువుగారి కలని నిజం చేయడానికి రామేశ్వరరావు ముచ్చింతల్‌లో తన సొంత 45 ఎకరాల అత్యంత విలువైన భూమిని గురుదక్షిణగా సమర్పించారు. మై హోమ్ గ్రూప్ సాంకేతిక, ఆర్థిక బలగాలన్నింటినీ ఉపయోగించి, స్వామివారి పర్యవేక్షణలో ఆ అద్భుతమైన క్షేత్రాన్ని నిర్మించారు. ఈ రోజు రామేశ్వరరావు కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, చినజీయర్ స్వామి ప్రతి ఆధ్యాత్మిక యాత్ర లోనూ, సేవా కార్యక్రమాల్లోనూ అగ్రభాగాన ఉంటూ ఒక ఆదర్శ శిష్యుడిగా కొనసాగుతున్నారు.

### నేత్ర విద్యాలయం, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి మార్గదర్శకత్వంలో, డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు మై హోమ్ గ్రూప్ భాగస్వామ్యంతో నడుస్తున్న రెండు అద్భుతమైన సామాజిక సేవా కార్యక్రమాల (నే త్ర విద్యాలయం మరియు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు) వివరాలీవిధంగా వున్నాయి. దఅష్టి లోపం ఉన్న (అంధులైన) పిల్లల జీవితాల్లో అక్షరాల వెలుగులు నింపడానికి నేత్ర విద్యాలయ పేరుతో విద్యాసంస్థను స్థాపించారు. సాధారణ బ్రెయిలీ లిపికే పరిమితం కాకుండా, ఈ పిల్లల కు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో ఆధునిక డిజిటల్ విద్యను అందిస్తున్నారు. ఇక్కడ చదువుకునే వందలాది మంది అంధ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు నాణ్యమైన భోజనం, హాస్టల్ వసతిని కల్పిస్తున్నారు.కేవలం స్కూల్ విద్యకే పరిమితం కాకుండా, అంధ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నేత్ర విద్యాలయం డిగ్రీ మరియు పీజీ కాలేజీని కూడా నడుపుతున్నారు. ఇక్కడి విద్యార్థులు నేడు టెక్నాలజీ రంగంలో నార్మల్ స్టూడెంట్స్‌తో పోటీ పడుతు న్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, వారి ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో "ఆరోగ్య వికాస్" అనే కార్యక్రమం ద్వారా ఈ ఉచిత క్యాంపులను నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ , రొమ్ము క్యాన్సర్ ల బారిన పడుతున్న గ్రామీణ మహిళల కో సం ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మై హోమ్ గ్రూప్ మరియు విరాళాల సాయంతో అధు నాతన మెడికల్ ఎక్విప్‌మెంట్ (మ్యామోగ్రామ్, స్క్రీనింగ్ మిషన్లు) కలిగిన ప్రత్యేక బస్సులను గ్రామీణ ప్రాంతాలకు పంపి పరీక్షలు చేయిస్తారు. ఒకవేళ స్క్రీనింగ్‌లో ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలుబయటపడితే, వారికి తదుపరి చికిత్స మరియు ఆపరేషన్ల కోసం జీయర్ ట్రస్ట్ మరియు మై హోమ్ సంస్థలు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకుంటాయి. వ్యాపారం ద్వారా వచ్చే లాభాలను స మాజంలో అత్యంత అవసరమైన ఇటువంటి విద్య, ఆరోగ్య రంగాలకు ఖర్చు చేస్తూ.. ఈ గురు-శిష్యుల బంధం వేలాది మంది జీవితాల్లో మార్పు తీసుకువస్తోంది.చిన్నప్పుడు చదువు కోసం తాను పడ్డ కష్టాలను మనసులో ఉంచుకుని, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మరియు వారి సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్న పరిసర ప్రాంతాలలోని పిల్లల కోసం పాఠశాలలను నడుపుతున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యాసంస్థలను స్థాపించి, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ ఆర్) కింద ఎందరో పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత మరియు రాయితీలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

### గ్రామాల్లో ఉచితవైద్య శిబిరాలు

హోమియోపతి డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన వ్యక్తి కావడం వల్ల ఆరోగ్య రంగంపై ఆయనకు ప్రత్యేక శ్రద్ధ ఉంది. మై హోమ్ ఇండస్ట్రీస్ మరియు కన్‌స్ట్రక్షన్ సైట్స్ పరిసర గ్రామాల్లో క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.తమ సొంత ఊరైన కుడ్కిల్లాతో పాటు తెలంగాణలోని పలు గ్రామాలను దత్తత తీసుకుని తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస వసతులను కల్పించారు. మై హోమ్ నిర్మించే ప్రతి గేటెడ్ కమ్యూనిటీలో పచ్చదనానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు.వారి 'మహా సిమెంట్' ఫ్యాక్టరీల పరిసరాల్లో వేలాది మొక్కలను నాటడం, నీటి పునరుత్పాదక పద్ధతులను పాటించడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు కఅషి చేస్తున్నారు. ఒక సాధారణ హోమియోపతి డాక్టర్‌గా మొదలై... వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించి, సంపాదించిన దాంట్లోఅధిక భాగాన్ని దైవకార్యాలకు, సామాజిక సేవలకు ఉపయోగిస్తూ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావుఆదర్శంగా నిలుస్తున్నారు.

### జీవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్

రామేశ్వరరావు స్వతహాగా హోమియోపతి డాక్టర్ కావడం వల్ల, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్యం అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ శివార్లలోని శంషాబాద్ (ముచ్చింతల్) వద్ద జీవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ పేరుతో (జిమ్స్ హోమియోపతి మెడికల్ హాస్పిటల్) ఈ భారీ ఆసుపత్రిని స్థాపించారు. ఒక సాధారణ కార్పొరేట్ అల్లోపతి ఆసుపత్రికి ఏమాత్రం తీసిపోని విధంగా, అన్ని రకాల అత్యాధునిక వైద్య పరికరాలు, ల్యాబ్ వసతులతో కూడిన వంద పడకల హోమియోపతి ఆసుపత్రి ఇది. ఇక్కడికి వచ్చే నిరుపేద రోగులకు ఉచితంగా లేదా చా లా తక్కువ ఫీజులతో నాణ్యమైన హోమియోపతి మందులు, వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య సేవలతో పాటు భవిష్యత్తు తరాలకు నాణ్యమైన హోమియోపతి విద్యను అందించడానికి ఇక్కడ జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ను కూడా నడుపుతున్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉంటారు. దీర్ఘకాలిక వ్యాధులు, పక్షవాతం, కీళ్లనొప్పులు వంటి సమస్యలకు హోమియోపతి ద్వారా శాశ్వత పరిష్కారాలు క నుగొనడానికి ఇక్కడ ప్రత్యేక పరిశోధన విభాగం కూడా పనిచేస్తోంది.

### గ్రామీణ సేవాకార్యక్రమాలు

ఫ్లోరైడ్ మరియు ఇతర కాలుష్య సమస్యలు ఉన్న అనేక తెలంగాణ గ్రామాలలో మై హోమ్ గ్రూప్ సొంత ఖర్చుతో ఉచిత వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తోంది.గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు మరియు మహిళలకు టైలరింగ్, కంప్యూటర్ కోర్సులు, ఎంబ్రాయిడరీ మరియు ఇతర చేతివఅత్తులలో ఉచిత శిక్షణ ఇచ్చి, వారు సొంతంగాఉపాధి పొందేలా సహాయం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేని చోట.. బెంచీలు, మరుగుదొడ్ల నిర్మాణం, డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు వంటి పనులను కార్పొరేట్ సా మాజిక బాధ్యత (సీఎస్ ఆర్) కింద చేపడుతున్నారు. వరదలు, కరువు వంటి ప్రకఅతి వైపరీత్యా లు సంభవించినప్పుడు గ్రామీణ బాధితులకు ఉచితంగా నిత్యావసర సరుకులు, బట్టలు, తాత్కాలిక వసతి కల్పించడంలో మై హోమ్ వాలంటీర్లు ముందుంటారు. ఈ విధంగా వ్యాపార సామ్రాజ్యం ఎంత విస్తరించినా, తన మూలాలను మరువకుండా గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు గారు నిరంతరం తోడ్పాటునందిస్తున్నారు.

### ఆదర్శవంతమైన క్రమశిక్షణ కలిగిన కుటుంబం

మై హోమ్ గ్రూప్ అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు కుటుంబం ఒక ఆదర్శవంతమైన మరియు క్రమశిక్షణతో కూడిన వ్యాపార కుటుంబం. ఆయన తన నలుగురు కుమారులను ఉన్నత విద్యావంతులను చేయడమే కాకుండా, మై హోమ్ గ్రూప్‌లోని వివిధ కీలక రంగాల బాధ్యతలనువారికి అప్పగించారు.

**డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు:** మై హోమ్ గ్రూప్ వ్యవస్థాపకులు మరియు గ్రూప్ చైర్మన్. వ్యాపార వ్యూహాలు, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను ఈయన పర్యవేక్షిస్తారు.

**శ్రీమతి జూపల్లి శ్రీకుమారి:** రామేశ్వరరావు గారి ధర్మపత్ని. ఆమె మై హోమ్ గ్రూప్ డైరెక్టర్లలో ఒకరిగా వ్యవహరిస్తూనే, కుటుంబ బాధ్యతలను చూసుకుంటారు. రామేశ్వరరావు గారికి నలుగురు కుమారులు ఉన్నారు. వీరంతా విదేశాలలో (ముఖ్యంగా లండన్/మాంచెస్టర్ బిజినెస్ స్కూల్స్) ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి, ప్రస్తుతం మై హోమ్ గ్రూప్ వ్యాపార సామ్రాజ్యాన్ని విజయవంతంగా నడిపిస్తున్నారు.

**జూపల్లి రంజిత్ రావు** మై హోమ్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్. రియల్ ఎస్టేట్ రంగాన్ని ఈయనే ప్రధానంగా పర్యవేక్షిస్తారు. హైదరాబాద్‌లో మై హోమ్ 'భూజా' వంటి మైలురాయి లాంటి మెగా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుల నిర్మాణంలో ఈయన కీలక పాత్ర పోషించారు.

**జూపల్లి శ్యామ్ రావు** మై హోమ్ గ్రూప్ డైరెక్టర్ (పూర్వపు మై హోమ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ). ఈయన యూకేలోని మాంచెస్టర్ బిజినెస్ స్కూల్ నుండి అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. సంస్థ ఆర్థిక వ్యవహారాలు, వ్యూహాత్మక విస్తరణలు మరియు సరికొత్త ప్రాజెక్టుల లాంచింగ్ బాధ్యతలను చూసుకుంటారు.

**జూపల్లి రాము రావు** మై హోమ్ ఇండస్ట్రీస్ (మహా సిమెంట్) ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ మరి యు డైరెక్టర్. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, మాంచెస్టర్ బిజినెస్ స్కూల్ నుండి ఎంబీఏ పూర్తి చేశారు. సిమెంట్ వ్యాపారంతో పాటు 'అబ్జా పవర్' మరియు పవర్ సెక్టార్ రంగాన్ని ఈయనపర్యవేక్షిస్తారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు రామేశ్వరరావుతో పాటు రాము రావు కూడా ఉన్నారు.

**జూపల్లి వినోద్ రావు** మై హోమ్ గ్రూప్ డైరెక్టర్. ఈయన కూడా మై హోమ్ గ్రూప్‌లోని వివిధ వ్యాపారాల నిర్వహణ మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

రామేశ్వరరావు కుటుంబంలో సమానత్వానికి ప్రాధాన్యత ఇస్తూ, తన కోడళ్లను కూడా వ్యాపార నిర్వహణలో భాగస్వాములను చేశారు.

**భార్గవి (రంజిత్ రావు భార్య):** మై హోమ్ కన్సల్టెన్సీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

**రాజిత (రాము రావు భార్య):** మై హోమ్ గ్రూప్ యొక్క హ్యూమన్ రీసోర్స్ (హెచ్ ఆర్ - మానవ వనరుల) విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు.

**మేఘన (వినోద్ రావు భార్య):** సంస్థ మార్కెటింగ్ మరియు కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగానికి హెడ్‌గా వ్యవహరిస్తున్నారు.

**ఐశ్వర్య (శ్యామ్ రావు భార్య):** ఉన్నత చదువులు పూర్తి చేసిన తర్వాత వ్యాపారాల్లోకి వచ్చే ఆ లోచనలో ఉన్నారు.

ఈ విధంగా జూపల్లి రామేశ్వరరావు కుటుంబ సభ్యులంతా కలిసి ఒక వ్యవస్థీకఅత కార్పొరేట్ శైలిలో మై హోమ్ గ్రూప్ వ్యాపారాలను నడిపిస్తున్నారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999